www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -286 గురువారం 22 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఫాలోఅప్ చేస్తాం

## హైదరాబాద్‌లో డబ్ల్యూఈఎఫ్ పెట్టుబడుల కొనసాగింపు సదస్సు

**ఏటా జులైలో నిర్వహణ : దావోస్ 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదన**

**ఏకగ్రీవంగా మద్దతు తెలిపిన బిజినెస్ లీడర్స్**

**అదే వేదికపై తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీ ఆవిష్కరణ**

**వాణిజ్య సదస్సులో సీఎంతో సినీ నటుడు చిరంజీవి భేటీ**

హైదరాబాద్ **జనవరి 21ప్రజావినికిడి**
దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్)లో జరిగే ఒప్పందాల అమలు కోసం ఇకపై ఏటా హైదరాబాద్‌లో ఫాలో-అప్ సదస్సులు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏటా జులై మాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని దావోస్ వేదికగా బుధవారం జరిగిన 'జాయిన్ ది రైజ్' కార్యక్రమంలో ప్రకటించారు. ఈ ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని అన్నారు. అందుకే



ప్రతీ యేడాది జులై లేదా ఆగస్టులో హైదరాబాద్‌లో ఫాలో-అప్ సదస్సు నిర్వహించాలని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ప్రతినిధులకు ఆయన సూచించారు. కాగా ప్రపంచంలోనే తొలి బ్యూటీ-టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జీసీసీ)ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని లోరియల్ సంస్థ ప్రకటించింది. మిగతా 2లో...



# ఏడాదిన్నర తరవాత పాదయాత్ర

## ఏలూరు నియోజకవర్గ కేడర్‌తో భేటీలో జగన్ వెల్లడి

**అన్ని రంగాల్లో కూటమి ప్రభుత్వం విఫలం**

**కూటమి పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి**

**వైకాపా ఉండగా రోజుకో బటన్ నొక్కే వాడిని**

**ఇక ఏడాదిన్నర తరవాత పాదయాత్రతో ప్రజల్లో ఉంటా**

**ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమికి పరాభవం తప్పదు**

అమరావతి, **జనవరి 21ప్రజావినికిడి**
వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రపై కీలక ప్రకటన చేశారు. ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర మొదలుపెడతానని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. అలా దాదాపు ఏడాదిన్నరపాటు ప్రజల్లోనే ఉంటానని చెప్పుకొచ్చారు. కూటమి పాలన ఏంటో ప్రజలకు పూర్తిగా అర్థమైంది. ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ వైపే చూస్తున్నారు. కేడర్ అంతా.. తప్పనిసరిగా ప్రజల్లో ఉండాలని పిలుపునిచ్చారు. ఏలూరుతోనే పాదయాత్ర మొదలవుతుందని అన్నారు. ఏలూరు నియోజకవర్గ కేడర్‌తో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. ఈ సమావేశానికి జయ ప్రకాశ్, కారుమూరి సునీల్, కార్యకర్తలు హాజరయ్యారు. నియోజకవర్గంలోని సమస్యలు తెలుసుకోవడంతో పాటు తాజా మిగతా 2లో...

# వైద్యవిద్యకు పెద్దపీట

## అన్ని వర్గాల సంక్షేమమే మా లక్ష్యం

### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

జగిత్యాల,**జనవరి 21ప్రజావినికిడి**
తెలంగాణలో విద్య, వైద్యం, అన్ని వర్గాల సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బుధవారం రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనం, రూ.10 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం,మిగతా 2లో...



# ఫోన్ ట్యాపింగ్ విచారణపై వాకబు

## కేసీఆర్‌ను కలిసిన హరీశ్‌రావు

## రాజకీయ పరిణామాలపై సమాలోచనలు

-మర్కుక్ **జనవరి 21ప్రజావినికిడి**
ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మంగళవారం సిట్ విచారణకు హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు.. బుధవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సిట్ విచారణలో జరిగిన పరిణామాలు, 2లో...



# 47 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

**రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు ఆదేశాలు**

**వెంటనేచేరాలని మున్సిపల్ శాఖ ఆదేశం**



హైదరాబాద్ **జనవరి 21ప్రజావినికిడి**
రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగాయి. 47 మందిని బదిలీ చేస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కువ కాలం ఒకే చోట పనిచేయడం, స్థానికులుగా ఉండడం వంటి కారణాల రిత్యా ఈసీ బదిలీలకు ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వెంటనే విధుల్లో చేరాలని మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. లేనిచో నిబంధనల మేరకు తగిన చర్యలు ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొంది.

# అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు... నో వర్క్..నో పే !

## స్పీకర్ల మహాసభలో అయ్యన్నపాత్రుడు

**'నో వర్క్.. నో పే' విధానం అమలు చేయాలన్న అయ్యన్న**

**సభకు రాకుండా జీతాలు తీసుకోవడం సరికాదని వ్యాఖ్య**




లక్నో, **జనవరి 21ప్రజావినికిడి**
శాసనసభకు ఒక్క రోజు కూడా హాజరు కాకుండా కొందరు ఎమ్మెల్యేలు జీతభత్యాలు తీసుకుంటున్నారని ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. నో వర్క్.. నో పే' అనే విధానం చట్టసభల్లోనూ రావాలని ఆయన అన్నారు. దానికి అనుగుణంగా చట్టం చేయాలని.. దానికి సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఆయా విభాగాల్లో ఉద్యోగులు విధులకు హాజరు కాకపోతే.. సంబంధిత అధికారులు క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సహా వారి వేతనాలు నిలిపి వేస్తున్నారన్నారు. మరి తాము ఎన్నుకున్న ఎమ్మెల్యేలు సభకు రానప్పుడు ఎందుకు చర్యలు తీసుకోరని ప్రజలుమిగతా 2లో...

# యువ సంపన్నుల జాబితాలో భారత్ టాప్

**యువ సెంటీమిలియనీర్ల జాబితాలో చైనా, యూకేను అధిగమించిన భారత్**

**ఈ జాబితాలో భారత్ నుంచి 201 మంది యువ పారిశ్రామికవేత్తలు**

**'ఇండియాస్ యూ40 క్యాపిటల్'గా నిలిచిన బెంగళూరు నగరం**

**జాబితాలోని 83 శాతం మంది తొలితరం వ్యాపారవేత్తలే!**

**సాఫ్ట్‌వేర్ రంగం నుంచి అత్యధికంగా 40 మందికి చోటు**



# తెలంగాణ దుర్భర పరిస్థితులకు నిదర్శనం

**ఒకేరోజు ముగ్గురు రైతుల ఆత్మహత్య**

**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్**

**రైతులకు 25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా డిమాండ్**

హైదరాబాద్, **జనవరి 21ప్రజావినికిడి**
తెలంగాణలో ఒకే రోజు ముగ్గురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత ఆందోళనకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సమైక్యరాష్ట్రంనాటి సంక్షోభ పరిస్థితులు తెలంగాణవ్యాప్తంగా నెలకొని ఉన్నాయనడానికి వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. ఆదిలాబాద్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ముగ్గురు రైతుల నిండు ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాపం ముమ్మాటికీ మిగతా 2లో...






# ఐరోపా దేశాల తీరుపై ట్రంప్ అసహనం

**అమెరికాలో ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధించాం**

**గ్రీస్ లాండ్‌పై వెనకడుగు లేదన్న ట్రంప్**

దావోస్,**జనవరి 21, :**
ఐరోపా దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఐరోపా కూటమి సరైన దిశలో వెళ్లడం లేదని విమర్శించారు. పెద్దఎత్తున వచ్చే వలసలపై ఇక్కడ నియంత్రణ లేదన్నారు. మిగతా 2లో...

# ఏడాదిన్నర తరవాత పాదయాత్ర

(మొదటి పేజి తరువాయి)

రాజకీయ పరిణామాలపై ఆయన చర్చించి కేడర్‌కు దిశానిర్దేశర చేశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ..'కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయి. ఏ ఒక్క వర్గానికి ఏ మేలు చేయని ప్రభుత్వం ఇది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు తోడుగా వైఎస్సార్‌సీపీ ఉంటుంది. విద్యార్థులు, రైతులు, యువత, అక్కచె÷-లలెమ్మలు ఏ వర్గానికి కష్టం వచ్చినా నిలబడుతున్నాం. జెండా పట్టుకుని వారి తరపున పోరాడుతున్నాం. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగించాలి. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ప్రతి ఇంట్లో ఇప్పుడు అదే చర్చ జరుగుతోంది. జగన్ ఉంటే, ఎలా మేలు జరిగేదన్నది ఆలోచిస్తున్నారు. ప్రభుత్వానికి మిగిలింది ఇంకా మూడేళు మాత్రమే. ఏడాదిన్నర తర్వాత పాదయాత్ర మొదలుపెడతాను. అలా దాదాపు ఏడాదిన్నరపాటు ప్రజల్లోనే ఉంటానని అన్నారు. ఇక ప్రతి వారం ఒక్కో నియోజకవర్గ కార్యకర్తలతో భేటీ అవుతాను. అందులో ఏడాదిన్నర తర్వాత నా పాదయాత్ర మొదలుపెడతాను. దాదాపు ఏడాదిన్నర పాటు నేను ప్రజల్లోనే, ప్రజలతోనే ఉంటాను. ఈరోజు పరిపాలన చాలా అన్యాయంగా జరుగుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ఎక్కడైనా, ఎవరినైనా, ఏమైనా చేయొచ్చు అన్న కండకావరంతో వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పాలనంతా అబద్దాలు మోసాలే.. ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారు. పోలీస్ వ్యవస్థను కూడా దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారు. అందుకే ప్రభుత్వంపై చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు. జగన్ ఉన్నప్పుడే బాగుండేది, ఆయన ప్రతి నెలా బటన్ నొక్కేవాడు. చెప్పింది చేసే వాడు. మాట నిలబెట్టుకునేవాడు. అన్నీ ఇచ్చేవాడు అని ప్రజలంతా, ప్రతి ఇంట్లో అనుకుంటున్నారు. మన ప్రభుత్వ హయాంలో రెండేళ్లు కోవిడ్ కష్టాలున్నా ప్రజలను ఇబ్బందిపెట్టలేదు. ఏ ఒక్క పథకం ఆపలేదు. ప్రజలకు చెప్పింది ప్రతిదీ చేసి చూపాం. మాట నిలబెట్టుకున్నాం. ప్రజలంతా అన్ని వాస్తవాలు గుర్తించారు. చంద్రబాబు మాదిరిగా అబద్దాలు చెప్పడం, మోసాలు చేసే వారు ఉండరని అంతా గుర్తించారు. మరోవైపు వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారు. గవర్నమెంటు స్కూల్స్ పూర్తిగా కళ తప్పాయి. మన హయాంలో గవర్నమెంటు స్కూల్స్, ప్రైవేటు పాఠశాలతో పోటీ పడే స్థితి ఉంటే.. ఇప్పుడు అంతా రివర్స్ అయింది. నాడు మన హయాంలో గవర్నమెంట్ స్కూల్లో దాదాపు 43 లక్షల మంది పిల్లలు చదివితే, ఈరోజు కేవలం 33 లక్షల మంది మాత్రమే చదువుతున్నారు. ఇక, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎనిమిది క్వార్టర్లు పెండింగ్‌లో పెట్టారు. రూ.5600 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.700 కోట్లు ఇచ్చారు. వసతి దీవెన కింద రూ.2200 కోట్లు బకాయి పెట్టారు. ఆరోగ్య శ్రీ కనుమరుగు చేశారు. 108, 104 సర్వీసులు నిర్వీర్యం చేశారు. కోవిడ్ టైమ్‌లో కూడా అన్ని సదుపాయాలతో మనం కొత్త వాహనాలు ప్రవేశపెడితే.. వాటిని ఇవాళ పడకేయించారు. ఇప్పుడు టీడీపీకి, డాక్టర్ల వింగ్‌కు చెందిన వారికి సర్వీసులు అప్పగించారు. ఇప్పుడు ఆ సర్వీసుల కోసం ఫోన్ చేస్తే, మూడు గంటలైనా రావడం లేదన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ పేరుతో పెద్ద కుంభకోణానికి తెరతీశారు. మన ప్రభుత్వ హయాంలో ఒకేసారి 17 మెడికల్ కాలేజీల పనులు మొదలుపెట్టాం. పూర్తైన 10 మెడికల్ కాలేజీలను ఈ ప్రభుత్వం అచ్చంగా ప్రైవేటీకరిస్తోంది. అంతే కాకుండా ఆ మెడికల్ కాలేజీల్లో రెండేళ్ల పాటు ప్రభుత్వమే జీతాలు చెల్లిస్తుందట. ఒక మెడికల్ కాలేజీలో జీతాలకు ఏటా రూ.60 కోట్లు కావాలి. అలా రెండేళ్లకు రూ.120 కోట్లు ఖర్చవుతాయి. ఈ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వారికి ఇవ్వడమే కాకుండా, రెండేళ్ల పాటు జీతం కూడా చెల్లిస్తారట. అంటే కాలేజీ ప్రభుత్వానిది. అలాగే ప్రభుత్వ స్టాఫ్. ఇంకా నిర్వహణ ఖర్చు ప్రభుత్వానిది. కానీ, లాభాలు మాత్రం ప్రైవేటువారికి వెళ్తాయి. ఇలాంటి స్కామ్‌కు పాల్పడిన వారిని, మేము రాగానే రెండు నెలల్లోనే చర్య తీసుకుంటామనగానే.. ఆ కాలేజీలు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. వ్యవసాయ రంగాన్ని కూడా నాశనం చేశారు. చివరకు ఎరువులు కూడా బ్లాక్‌లో కొనాల్సి వస్తోంది. అత్యంత కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు పూర్తిగా నాశనం కాగా, తాజాగా నాలుగో వ్యవస్థ శాంతి భద్రతలను కూడా నాశనం చేశారు. రాష్ట్రంలో ఎవరికీ భద్రత లేకుండా పోయింది. ఎక్కడా పోలీసింగ్ వ్యవస్థ కనిపించడం లేదు. ఇంకా మొత్తం ప్రైవేటీకరణ.. అదే అనుకుంటే చివరకు సీఎం పదవిని కూడా ప్రైవేటుకు ఇవ్వొచ్చు కదా?. అన్నింటా విఫలమైన ప్రభుత్వం.. ప్రశ్నించే గొంతు నొక్కుతోంది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, కేసులతో వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రజలకు తోడుగా నిలబడుతోంది. విద్యార్థులు, యువత, రైతులు, అక్క చె÷-లలెమ్మలు.. ఎవరికి ఏ కష్టం వచ్చినా, వారందరి తరపున జెండా పట్టుకుని నిలబడుతున్నాం. గట్టిగా పోరాడుతున్నాం. ఇదే స్ఫూర్తి ఇక ముందు కూడా కొనసాగాలి. ఆ దిశలో మీరంతా కలిసికట్టుగా పని చేయాలి' అని అన్నారు.

# అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకునో వర్క్..నో పే !

(మొదటి పేజి తరువాయి)

ప్రశ్నిస్తున్నారని అయ్యన్న తెలిపారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనను ఎలా సమర్థించగలుగుతామని ప్రశ్నించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో నిర్వహించిన వివిధ రాష్ట్రాల శాసనసభాపతుల సదస్సులో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్రజల పట్ల శాసనవ్యవస్థ జవాబుదారీతనం అనే అంశంపై అయ్యన్న మాట్లాడారు. కొందరు ఎమ్మెల్యేలు ఒక్క చర్చలోనూ పాల్గొనలేదు. సభకు రాకుండా జీతాలు తీసుకుంటున్నారు. అలాంటి వారిని చూస్తుంటే వేదన కలుగుతోంది. అనైతిక ప్రవర్తనతో ప్రజల దృష్టిలో చులకన కాకుండా ఉంటారా?ఇలాంటి సభ్యుల వ్యవహారశైలిని నిషేధించే నిబంధనలేవీ లేవు. చట్టసవరణ చేసి సభకు రాని సభ్యులకు 'నో వర్క్-నో పే' నిబంధన అమలు చేయాలి. అలాంటి వారిని రీకాల్ చేసేలా ప్రజలకు హక్కు కల్పించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. 2024 ఎన్నికల తర్వాత అసెంబ్లీకి ఒక్కరోజు కూడా రానివారు ఉన్నారని.. కనీసం సభలో జరిగే ప్రశ్నోత్తరాలు, చర్చల్లోనూ పాల్గొనడం లేదని ఏపీ స్పీకర్ పేర్కొన్నారు. దీనివల్ల తమను ఎన్నుకున్న ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వ్యాఖ్యలు చేశారు. ఇలా సభకు హాజరు కాకపోవడం వలన ప్రజల దృష్టిలో సభ్యులు చులకనవుతున్నారని చెప్పుకొచ్చారు. సభకు హాజరు కాకుండానే వారు వేతనాలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారంగా.. 'నో వర్క్.. నోపే' విధానానికి అనుగుణంగా చట్టం చేయాలని.. అఖిల భారత సభాపతుల సదస్సులో తీర్మానం చేయాలని కోరారు. సభకు రానివారిని రీకాల్ చేసే హక్కు ప్రజలకు కల్పించేలా చట్టం చేయాలని ఏపీ స్పీకర్ ప్రతిపాదించారు.

# ఫోన్ ట్యాపింగ్ విచారణపై వాకబు

(మొదటి పేజి తరువాయి)

అధికారుల ప్రశ్నలు.. తాను చెప్పిన సమాధానాలు తదితర అంశాలను కేసీఆర్‌కు హరీశ్‌రావు వివరించినట్టు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో జరుగుతున్న విచారణ రాజకీయ ప్రేరేపితంగా సాగుతోందని, ప్రజలను గందరగోళానికి గురి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలియజేసినట్టు తెలిసింది. విచారణను ఎదుర్కొవడంలో అను సరించాల్సిన వ్యూహాలపై సమా లోచనలు జరిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, రాబోయే రాజకీయ సవాళ్లపై కూడా ఇరువురు చర్చించినట్టు సమాచారం. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను సమగ్రంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని ఈ భేటీలో అభిప్రాయం వ్యక్తమైనట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

# ఫాలోఅప్ చేస్తాం

ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్‌లో ప్రారంభించనుంది. దావోస్‌లో జరుగుతున్న డబ్ల్యూఈఎఫ్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డితో లోరియల్ సీఈవో నికోలస్ హియోరోనిమస్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ-టెక్ జీసీసీని ఏర్పాటు చేసే నిర్ణయాన్ని ఆయన వెల్లడించారు. ఈ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా మారనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్

ఈ సందర్భంగా తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రితోపాటు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును లోరియల్ సంస్థ ఆహ్వానించింది.

హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ-టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్, జాగర్, కోస్టో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులకు వివరించింది. జీసీసీతోపాటు మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్రంలోగల అవకాశాలను పరిశీలించాలని లోరియల్ సంస్థ విభాగాధిపతులను వారు ఆహ్వానించారు. తెలంగాణలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు హియెరోనిమస్ ఈ సందర్భంగా హామీనిచ్చారు.

బ్లైజ్ కంపెనీ ఒప్పందం

మరోవైపు కాలిఫోర్నియాకు చెందిన బ్లైజ్ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఈ సంస్థ వ్యవస్థాపక సీఈవో దినాకర్ మునగాలా సీఎంతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. డేటా సెంటర్ అర్టిఫిషియల్ కంప్యూటింగ్‌కు ఈ సంస్థ తక్కువ శక్తిని వినియోగించే హార్డ్‌వేర్, ఫుల్-స్టాక్ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనుంది. బ్లైజ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో రీసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ ఇంజినీరింగ్ సెంటర్‌ను నిర్వహిస్తోంది. తన ఆర్ అండ్ డీ సెంటర్‌ను విస్తరించేందుకు వీలుగా పెట్టుబడులు, ప్రణాళికలపై ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు సీఎంతో చర్చించారు. హెల్త్‌కేర్ డయాగస్టిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, ఎనర్జీ ఎఫిషియెన్సీ వంటి రంగాల్లో ఏఐ ద్వారా పరిష్కారాలను కనుగొనటం, వాటిని పైలట్ ప్రాజెక్టులుగా అమలు చేసేందుకు ఉండే అవకాశాలపై వారు సమాలోచనలు చేశారు.

అనంతరం సీఎం మాట్లాడుతూడ తెలంగాణను ఏఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దటమనేది వచ్చే రెండు దశాబ్దాల్లో మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్వాంటం కంప్యూటింగ్, హార్డ్‌వేర్, ఆటోమేషన్ రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకు సాగుతోందని అన్నారు. దేశంలోనే టెక్నాలజీ హబ్‌గా రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. బ్లైజ్ సంస్థకు సంబంధించిన ఆర్ అండ్ డీ యూనిట్ విస్తరణకు ప్రభుత్వం తగిన మద్దతునిస్తుందని హామీనిచ్చారు. హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైందని వివరించారు. రూ.5.75 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తమ ప్రభుత్వం ఆకర్షించిందని చెప్పారు. 'ప్రతీ యేడాది మేము ఎంవోయూలపై సంతకాలు చేయడానికి దావోస్‌కు వస్తాం.. కానీ ఈసారి గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో, తెలంగాణ రైజింగ్ విజన్, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను ప్రపంచానికి చూపించడానికి వచ్చాం" అని తెలిపారు. హైదరాబాద్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లకు ప్రధాన కేంద్రంగా మారిందని వివరించారు.

మూసీ నది పునరుజ్జీవనంతోపాటు రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయటం ద్వారా నైట్ టైమ్ ఎకానమీపై దృష్టి సారిస్తామని చెప్పారు. తద్వారా దేశంలోనే 24 గంటలు పనిచేసే తొలి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని ప్రకటించారు. ఇందులో 50 శాతం కంటే ఎక్కువ గ్రీన్ కవర్ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలను ప్రదర్శించారు. అదే వేదికపై తెలంగాణ ఇన్నోవేషన్ హబ్ తెలంగాణ నెక్ట్స్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీలను ఆవిష్కరించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిడ హైదరాబాద్‌లో మెట్రో రైలు విస్తరణ, చెరువులు, కుంటల పునరుజ్జీవనం వంటి గేమ్-చేంజర్ ప్రాజెక్టులను వివరించారు. కొత్తగా ప్రతిపాదించిన కోర్, ప్యూర్, రేర్ అర్థిక వృద్ధి జోన్ల ప్రణాళికలను ప్రస్తావించారు. తెలంగాణకు అపారమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని, సాంకేతికత, అనుభవం, నైపుణ్యాలపరంగా గ్లోబల్ కంపెనీల సహకారం స్వీకరిస్తామని వారు తెలిపారు.

# తెలంగాణ దుర్భర పరిస్థితులకు నిదర్శనం

(మొదటి పేజి తరువాయి)

ఈ చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని మండిపడ్డారు. భూపాలపల్లిలో కోడెల సదానందం, మెదక్ లో దేవ్ సోత్ సర్వేశ్, ఆదిలాబాద్ లో జాదవ్ అంకుష్ కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ ముగ్గురు రైతుల ఆత్మహత్యలకు అప్పులే ప్రధాన కారణం కావడం, రేవంత్ సర్కారు మోసాలను, అబద్ధపు హామీల పేరిట చేసిన తీరని ద్రోహాన్ని అడుగడుగునా ఎత్తిచూపుతోందని అన్నారు. రుణమాఫీ పేరిట చేసిన నయవంచనకు తోడు, పెట్టుబడి సాయానికి పాతరేయడం, చివరికి యూరియాను కూడా ఎగ్గొట్టి దిగుబడిని దెబ్బతీయడంతో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్నదాత పరిస్థితి అనాథలా మారిందని అన్నారు. కేవలం రెండేళ్ల కాలంలోనే దాదాపు 900 మంది రైతులు గుండెపగిలి బలవన్మరణాలకు పాల్పడినా ఈ సన్నాసి సర్కారుకు ఇప్పటికీ సోయి రాలేదని కేటీఆర్ మండిపడ్డారు. పదేళ్లు ధైర్యంగా బతికిన రైతు కుటుంబాల్లో ఇవాళ మోగుతున్న ఈ మరణమృదంగానికి రేవంత్ సర్కారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అన్నదాతలారా.. దయచేసి ధైర్యం కోల్పోకండి. మరో మూడేళ్లు ఓపిక పట్టండని సూచించారు. ఈ వ్యవసాయ వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని, రైతు ద్రోహి రేవంత్ ను గద్దెదించుదామని.. మన తెలంగాణలో వ్యవసాయరంగానికి మళ్లీ మంచిరోజులు తెచ్చుకుందామని అన్నారు. వివరాల్లోకి వెళితే.. అప్పుల బాధతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద ఘటనలు జయశంకర్ భూపాలపల్లి, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం గ్రామానికి చెందిన కోడెల సదానందం (42) పోతులవాయి శివారులో తనకున్న 4 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాడు. పెట్టుబడుల కోసం తెచ్చిన రూ.2 లక్షలకుపైగా అప్పు అలాగే ఉండిపోయింది. అప్పులు తీర్చేమార్గం లేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఇం ట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు కాటారం ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బతుకమ్మతండాకు చెందిన రైతు దేవ్‌సోత్ సర్వేశ్ (57) తనకున్న ఎకరం ఐదు గుంటల పొలంలో బోరు వేశాడు. ఇల్లు కట్టి, ఇద్దరు కుమారుల పెండ్లి చేయడానికి రూ.8 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు ఎక్కువయ్యే సరికి వాటిని ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఈనెల 11న పెద్దకొడుకు అనిల్‌కు ఫోన్‌చేసి గడ్డిమందు తాగినట్టు చెప్పాడు. వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడ నుంచి హైదరాబాద్‌లోని గాం ధీ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం పి ట్‌గావ్ గ్రామానికి చెందిన రైతు జాదవ్ అంకుష్ (33) తనకున్న మూడెకరాల్లో పత్తి, కంది సాగు చేశాడు. ఇందుకోసం అప్పులు తీసుకున్నాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసిక వేదనకు గు రైన అంకుష్ ఈనెల 18న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు.

# ఐరోపా దేశాల తీరుపై ట్రంప్ అసహనం

(మొదటి పేజి తరువాయి)

స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరుగుతున్న 'ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొని ప్రసంగించిన ఆయన.. తన పాలనలో అమెరికా అభివృద్ధి పథంలో అద్భుతంగా దూసుకెళు తుదన్నారు. దేశంలో ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేశామని, ప్రపంచ ఆర్థిక ఇంజిన్‌గా అమెరికా నిలుస్తోందన్నారు. ఈ సదస్సుకు హాజరైన ఎంతో మంది మిత్రులు, కొందరు శత్రువులకు శు భాకాంక్షలు. నన్ను ఎన్నుకున్నందుకు అమెరికా ప్రజలు సంతోషంగా ఉన్నారు. రెండేళ్ల క్రితం మాది నిర్జీవ ఆర్థిక వ్యవస్థగా ఉండేది. ఇప్పుడు మళ్లీ సజీవంగా మారింది. ఐరోపాలో కొన్ని ప్రాంతాలకు ఇంకా గుర్తింపు లేదు. ఈ ఖండం అంటే నాకు చాలా ఇష్టం. కానీ, అది సరైన దిశలో వెళ్లడం లేదు. గతంలో జరిగిన నష్టాలను పునరుద్ధరించుకునేందుకు విదేశాలపై సుంకాలు పెంచుతున్నాం. ఇప్పటికే చాలా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాం అని వివరించారు. అమెరికా వృద్ధిపథంలో దూసుకెళ్తోంది. ఎంతో కాలం వెనెజువెలా కూడా అద్భుతంగా ఉండేది. కానీ, సొంత విధానాలతో వాళ్లకు వాళ్లే నాశనం చేసుకున్నారు. దాడి తర్వాత మాతో డీల్ కుదుర్చుకున్నారు. విండ్‌మిల్స్‌ను తయారు చేసి ఐరోపాకు అమ్ముతున్న చైనా భారీగా లాభాలు పొందుతోంది. పక్షులకు హాని కలిగించే, ప్రకృతిని నాశనం చేసే వాటిని తెలివితక్కువ వారే కొంటారు. ఎనర్జీతో నగదు సంపాదించుకోవాలి కానీ కోల్పోకూడదు అని ట్రంప్ హితవు పలికారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సామ్రాజ్యవాద ధోరణిని కొనసాగిస్తున్నారు. ఇటీవలే వెనిజువెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసి.. అక్కడి ప్రభుత్వాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకున్న ట్రంప్.. ఈసారి దావోస్ సదస్సులో గ్రీన్‌లాండ్‌ను హస్తగతం చేసుకుంటామని తేల్చి చెప్పారు. ప్రపంచ నేతల ముందే తాము మంచుముక్కను మాత్రమే అడుగుతున్నామని, అది కూడా గ్రీన్‌లాండ్‌కు రక్షణకోసమేనని ఆయన అన్నారు. అంతేకాదు ప్రపంచ ఆర్థిక సదస్సు సాక్షిగా 'భారత్, పాకిస్థాన్ యుద్ధాన్ని నేనే ఆపాను' అని ట్రంప్ పాత పాటే మళ్లీ పాడారు.

ఈ ప్రపంచంలో గ్రీన్‌లాండ్‌ను సురక్షింతంగా చూసుకోగల దేశం అమెరికా మాత్రమే. వ్యూహాత్మక స్థావరమైన ఈ దేశాన్ని మేము కొనేందుకు సిద్దంగా ఉన్నాం. మా ప్రతిపాదనకు అవును, కాదు అని ఎంతమంది చెబుతారు. ఏదిఏమైనా అమెరికా మాత్రం గ్రీన్‌లాండ్‌ను వదులుకోదు. ఇక నాటోకు మేము చాలా నిధులు ఇస్తున్నాం. కానీ, బదులుగా మెరికాకు ఏమాత్రం లబ్ది చేకూరడం లేదు. యూరప్ సరైన మార్గంలో వెళ్లడం లేదు. కానీ, యూరప్ సంరక్షణకు అమెరికా ఎల్లప్పుడూ ప్రాధాన్యమిస్తుంది. అయితే.. వామపక్ష విధానాల కారణంగా యూరప్ శక్తిసామర్థ్యాలు దారుణంగా తగ్గిపోయాయి. గ్రీన్ ఎనర్జీ, భారీగా వలసలు.. ఆ ప్రాంతాన్ని ఘోరంగా దెబ్బతీశాయి' అని ట్రంప్ వెల్లడించారు.

# యువ సంపన్నుల జాబితాలో భారత్ టాప్

**జనవరి 21ప్రజావినికిడి**

ప్రపంచవ్యాప్తంగా యువ పారిశ్రామికవేత్తల విషయంలో భారత్ తన ఆధిపత్యాన్ని చాటుకుంది. 40 ఏళ్లలోపు వయసున్న సెంటీమిలియనీర్ల (వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద) జాబితాలో చైనా, యూకే వంటి దేశాలను భారత్ అధిగమించింది. అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్, హురున్ ఇండియా సంయుక్తంగా బుధవారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో మొత్తం 505 మంది యువ వ్యాపారవేత్తలు ఉండగా, వారిలో 201 మంది భారతీయులే కావడం విశేషం.ఈ నివేదిక ప్రకారం, భారత్ నుంచి 201 మంది, చైనా నుంచి 194 మంది, యూకే నుంచి 110 మంది యువ వ్యాపారవేత్తలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. దేశంలో అత్యధికంగా బెంగళూరు నుంచి 48 మంది పారిశ్రామికవేత్తలు ఈ జాబితాలో ఉండటంతో, ఆ నగరం 'ఇండియాస్ యూ40 క్యాపిటల్'గా తన స్థానాన్ని పదిలం చేసుకుంది. 36 నుంచి 40 ఏళ్ల వయసు ఉండి, తొలితరం పారిశ్రామికవేత్తలకు కనీసం 100 మిలియన్ డాలర్లు, వారసత్వ వ్యాపారవేత్తలకు 200 మిలియన్ డాలర్ల వ్యాపార విలువ ఉన్న వారిని ఈ జాబితా కోసం పరిగణనలోకి తీసుకున్నారు.భారత్‌లో పెరుగుతున్న వ్యవస్థాపక స్ఫూర్తికి అద్దం పట్టేలా, జాబితాలోని భారతీయ పారిశ్రామికవేత్తలలో 83 శాతం మంది తొలితరం వారేనని నివేదిక పేర్కొంది. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, సేవల రంగం నుంచి అత్యధికంగా 40 మంది ఉండగా, ఆ తర్వాత హెల్త్‌కేర్ (18), రవాణా (16), ఆర్థిక సేవల (15) రంగాల వారు ఉన్నారు. ఈ యువ పారిశ్రామికవేత్తల సంస్థల మొత్తం విలువ 357 బిలియన్ డాలర్లు కాగా, ఇవి 4.43 లక్షల మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నాయి. 'ఈ తరం పారిశ్రామికవేత్తలు ఇప్పటికే దేశ జీడీపీ, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తున్నారు' అని అవెండస్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఎండీ అండ్ సీఈవో అపూర్వ సాహిజ్వానీ తెలిపారు.విద్యాసంస్థల పరంగా చూస్తే, ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి 15 మంది పూర్వ విద్యార్థులు ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. మహిళా ప్రాతినిధ్యంలో మాత్రం చైనా (29) ముందుండగా, భారత్ నుంచి 15 మంది మహిళలు ఉన్నారు.

# వైద్యవిద్యకు పెద్దపీట




(మొదటి పేజి తరువాయి)

రూ.17 కోట్లతో వాటర్ ప్లాంటు నిర్మాణం, రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ఎస్సీ బాలుర వసతిగృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జిల్లాలో ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాల నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయించాం. ఒకే ప్రాంగణంలో విద్య, ఆటలు, హాస్టల్, ల్యాబ్స్, డైనింగ్, క్రీడలు అన్నీ ఉండేలా ప్రణాళిక రూపొందించాం. పేద కుటుంబాల పిల్లలకు మంచి అవకాశాలు ఇస్తే వారు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని మేం నమ్ముతున్నాం. వెనుకబడిన వర్గాలు చదువులు, ఉద్యోగాల్లో, సమాజ నిర్మాణంలో ముందుకు రావాలంటే ప్రభుత్వం తరఫున చేయాల్సిన కృషి చేస్తున్నాం. అభివృద్ధి అంటే కేవలం భవనాల నిర్మాణం కాదు, ప్రజల జీవితాల్లో మార్పు రావడం. ఎన్నికల సమయంలో చేసిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం. పారదర్శకత, నిబద్ధత, సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని భట్టి అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 22 జనవరి 2026

## ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సంపూర్ణ మద్దతు

### ఫిలిం నగర్ కార్పొరేటర్ కులబంధు వెంకటేష్



**ఎల్బీనగర్,జనవరి 21 (ప్రజావినికిడి):**ఫిలింనగర్ కార్పొరేటర్ కుల బంధు వెంకటేష్ వడ్డెర వడ్డే ఓబన్న విగ్రహాల ప్రతిష్టలపై సానుకూలంగా స్పందించి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.విగ్రహ ఏర్పాటుకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ వుంటాయని తెలిపారు.ఓబన్న విగ్రహ ఏర్పాటును అభినందిస్తూ విగ్రహ ప్రతిష్ట కమిటీ నాయకులు ఏత్తరి భీమ్ రాజును సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎత్తారి మారి,మొగత్ నాగేష్,మొగత్ బసవరాజు,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరెకటికలకు కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలి

**ప్రజావినికిడి, (ముషీరాబాద్):**
ఆరెకటికలకు కార్పోరేషన్ ను ఏర్పాటు చేయాలి కంటెస్ట్ ఎమ్మెల్యే, వ్యవస్థాపక అధ్యక్షులు అశోక్ దాదా ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఆరెకటికలు బాగ్‌లింగం పల్లి సుందరయ్య విజ్ఞానం వద్ద ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ ఎన్నికలలో గెలిచిన సర్పంచ్,ఉప సర్పంచులకు సన్మాన సభ ఏర్పాటు చేసి సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోదండరాం రెడ్డి విచ్చేసి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా అశోక్ దాదా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వశీ ఆరెకటికలకు మాట ఇవ్వడమే తప్ప ఇప్పటి వరకు నెరవేర్చింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైన్స్ టెండర్లలో తమకు 30 శాతం కేటాయిస్తామని చెప్పి మోసం చేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి 500 కోట్ల రూపాయలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా బీసీ డీ నుండి బీసీ ఏ హోదాలోకి కల్పిస్తూ జీవోను జారీ చేసి అమలు పరచాలన్నారు. రాష్ట్రంలో మొత్తం తొమ్మిది మేకల మండిలు ఉండగా ఒక్క జియాగూడ నుండే




సంవత్సరానికి వంద కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని దుయ్యబట్టారు.ఇన్ని కోట్ల ఆదాయం వచ్చినా కూడా ఆరెకటికలకు చిన్న చూపు చూడడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆరెకటికలను గుర్తించి ఆదుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నందీశ్వర్, ఉపాధ్యక్షులు ఎం.నాగశేషు, కే.వెంకటేష్,పాలం రమేష్,కే.శ్రీనివాస్, జే.శ్రీనివాస్,కేఎల్ శ్రీనివాస్,జాయింట్ సెక్రటరీ జే.శ్రీనివాస్, జే.నరేష్,ట్రెజరర్ కేడీ.దినేష్,మహిళా ప్రధాన కార్యదర్శి కే.వనజాబాయి,గ్రేటర్ అధ్యక్షురాలు ఎస్.సరస్వతీ బాయి, జీ.రమేష్ కే.గోపాల్, డీ.శ్రీనివాస్, తల్జారామ్, మహేందర్,రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని కలిసిన ఫణిగిరి కాలనీ నూతన కార్యవర్గం






**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
చతన్యపురి డివిజన్ లోని ఫణిగిరి కాలనీ నూతన కార్యవర్గం ఎమ్మెల్యే ని కలువడం జరిగింది.ఫణిగిరి కాలనీ నూతన కమిటీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ని కలవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకమిటీ సభ్యులకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.కాలనీ అభివృద్ధిలో అన్ని విధాలా తోడు ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పినాయకులు తోట మహేష్ యాదవ్,చంద్రశేఖర్ రెడ్డి.ఫణిగిరి కాలనీ కూసగుండ్ల లక్ష్మీ నరసింహ స్వామి గుడి చైర్మన్ కృష్ణారెడ్డి,విశ్వప్రేమ్,కాలనీ సభ్యులు నరేందర్ రెడ్డి,నూతన కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,గౌరవ అధ్యక్షులు శ్రీగంధం సుబ్బారావు,జనరల్ సెక్రటరీ జగ్ భూషణ్ సింగ్, కోశాధికారి రవి కుమార్,ఆర్గనైసింగ్ సెక్రటరీ జగన్, నర్సింహ రావు,నర్సింహారెడ్డి,ఓం కిరణ్,నర్సింహ, కార్యనిర్వహకులు శ్రీనివాస్,రాములు, విజయ్, నరేందర్, అశోక్,గోవర్ధన్, రాకేష్, శ్రవణ్,గణేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## మహిళా స్వయం సహాయక సంఘం అధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణి

### కాంగ్రెస్ నేత చెంది తిరుపతి రెడ్డి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి నినాదం తో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న సందర్భంగా ఇప్పటికే షాద్ నగర్ నియోజకవర్గం లో ముందుగా మహిళా గ్రూపుల ద్వారా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా ఇప్పుడు రేషన్ షాపుల్లో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమం నడుస్తుంది.తెల్ల రేషన్ కార్డు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని షాద్ నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి షాద్ నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి

### వెల్దండ ఎస్ఐ ఎస్. కురుమూర్తి,సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

**ప్రజావినికిడి,(వెల్దండ):**ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వెల్దండ ఎస్ఐ ఎస్. కురుమూర్తి,స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ లు పిలుపునిచ్చారు.. నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాస ఉత్సవాలలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణలపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కురుమూర్తి మాట్లాడుతూ,ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలపై అవగాహన పెంపొందించుకొని తోటి వారిని చైతన్య పరచాలని కోరారు, ముఖ్యంగా ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడంతో పాటు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. అనంతరం మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ, ప్రతిరోజు ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారనిఆసుపత్రి పాలవుతున్నారని అలా జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి రోడ్డు నిబంధనలు




తప్పనిసరిగా పాటించాలని సూచించారు.బుద్ధార్ పేట ఆంజనేయస్వామి దేవాలయం నుండి వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.అనంతరం హెల్మెట్ ధరించే వాహనదారులకు ఎస్ఐ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వెల్దండ ఉపసర్పంచ్ బసన్మోని శ్రీను,వార్డు సభ్యులు గుద్దటి కిష్టల్, మారేపల్లి శ్రీను, దేవేందర్,ముదికొండ రమేష్,మసిగుండ్ల వెంకటేష్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, నాయకులు బడక రామకృష్ణ,ప్రశాంత్ కుమార్,మధు శ్రీనివాస్ రెడ్డి చంద్రకాంత్,ఆర్మీ ప్రవీణ్ రెడ్డి,అరుణ్ ముదిరాజ్,మట్ట శివ గౌడ్ అఫోర్జ్ అనిల్ పోలీస్ సిబ్బంది వెంకటరెడ్డి శ్యామ్ నాగమల్లయ్య రవి చంద్రశేఖర్ రాఘవేందర్ గౌడ్, మహేష్ తదితరులు ఉన్నారు.

## మేడారంలో జాతర సందడి

### భారీగా తరలి వస్తున్న భక్త జనం

### ఘనంగా మండమెలిగె పండగ నిర్వహణ

### గద్దెల వద్ద పూజులరు ప్రత్యేక పూజలు

ములుగు,**జనవరి 21ప్రజావినికిడి**: మేడారం సమ్మక్క సారలమ్మ దేవతల మండ మెలిగే పండుగను పూజారులు - అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారంఉదయాన్నే మేడారం సమ్మక్క దేవత పూజరులు సిద్దబోయిన, కొక్కెర, మ్లలెల, వంశీయులు, నె రాలమ్మ పూజారులు కాక వంశీయులు వారి వారి ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. అనంతరం పిల్లాపాపలతో సహా పవిత్ర స్నానాలు చేశారు. సమ్మక్క పూజారులు మేడారం గుడికి సారల మ్మపూజారులు కన్నెపెల్లి గుడికి వెళ్లి గుడులను పవిత్ర గోదావరి జలంతో శుద్ధి చేశారు. అనంతరం సమ్మక్క పూజారి ఆయన సిద్ధబో యిన నితిన్, సారలమ్మ పూజారి అయిన కాక సారయ్య ఇండ్ల వద్ద డోలు వాయిద్యాల నడుమ మామిడాకు తోరణాలను కట్టారు. అక్కడినుం డి పూజారులు ఆడపడుచులు (ఆడబిడ్డలు) పూజా సామగ్రితో మంగళ హారతులతో ఆయా గుడులకు చేరుకున్నారు. ఆడబిడ్డలు అడవి నుంచి తెచ్చిన పుట్ట మన్నుతో గుడులను అలికి ముగ్గులు వేశారు. అనంతరం పూజారులు డోలు వాయిద్యాల నడుమ బొడ్రాయి, ముత్యా లమ్మ, భూలక్ష్మి, మహాలక్ష్మి లకు నూతన వస్త్రా లు పెట్టి పసుపు కుంకుమ పెట్టి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అక్కడ నుంచి నేరుగా ఆలయం ముందు బురికా స్తంభాలతో తోరణా నికి చీడపీడలు రాకుండా కోడిపిల్ల, సొరకాయ, మిరపకాయ, మామిడి, వేప మండలు కట్టి తోరణం కట్టారు. అనంతరం గ్రామ పొలిమే రలల్లో బూరిక చెట్లతో తోరణాలు కట్టారు. సాయంత్రం డోలు వాయిద్యాల నడుమ గద్దెల వద్దకు చేరుకొని రహస్య పూజలు చేశారు. దీంతో మహాజాతరకు అంతా సిద్ధమ ని పూజారులు తెలిపారు. ఇదిలావుంటే గత వారం రోజులుగా భక్తుల పెద్ద ఎత్తున పోటెత్తారు. భారీగా తరలి వస్తున్నారు. దీంతో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## ముఖ ద్వారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజావినికిడి ,(హయత్ నగర్):**
హయత్ నగర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవాలయం హైకోర్టు కాలనీ నూతన ప్రవేశ ముఖ ద్వారం నక్క రఘునందన్ యాదవ్ జ్ఞాపకార్థం వారి సతీమణి నక్క పుణ్యవతి సహకారంతో నిర్మించిన ముఖ ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ,ఇట్టి ఆర్చి నిర్మాణం కోసం సహాయ సహకారాలు అందించిన నక్క కుటుంబసభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.గతంలో చిన్నపాటి వర్షానికి ఇట్టి కాలనీ జలమయం అయ్యేది అని దానికి ప్రత్యామ్నాయంగా బాక్స్ డ్రైన్స్ నిర్మించడం జరిగింది అని గుర్తు చేశారు.అలాగే కాలనీల అన్ని రోడ్ల నందు డ్రైన్స్,రోడ్లు,మంచినీటి సౌకర్యాలు కల్పించడం జరిగింది అని గుర్తు చేశారు.పార్టీలకు అతీతంగా నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది అని తెలిపారు.ఇప్పటికే ప్రధాన సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేయడం జరిగింది



అని అన్నారు.రాబోయే రోజుల్లో శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మంచినీరు అందించడం జరుగుతుంది అని హామీ ఇచ్చారు.ఇప్పటికే పనులు ప్రారంభం కావడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి,డివిజన్ అధ్యక్షులు చెన్నగొని శ్రీధర్ గౌడ్,మహిళా అధ్యక్షురాలు అంజలి,తూర్పు కాలనీల అధ్యక్షులు దీపావళి శ్రావణ్ కుమార్,భాస్కర్ సాగర్,మల్లేశ్



ముదిరాజ్,గుత్తా లక్ష్మణ్ రెడ్డి,గుజ్జ జగన్ మోహన్,దీపావళి శ్రీకాంత్,ప్రదీప్,కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్,ఉపాదక్షులు మోహన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్,కార్యనిర్వాహక కార్యదర్శి మురళి కృష్ణరాజు,నక్క వెంకట్ స్వామి,నక్క వంశీకృష్ణ యాదవ్,నక్క ప్రసాద్ బాబు యాదవ్,నక్క ప్రవీణ్ కుమార్ యాదవ్,నక్క శ్రావణ్ కుమార్ యాదవ్,దేవాలయం ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిపై బిఆర్ఎస్ దుష్ప్రచారం

### కవిత ప్రశ్నలకు సమాధనం చెప్పండి: పొన్నం



హైదరాబాద్,**జనవరి 21ప్రజావినికిడి**సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గత ప్రభుత్వం 30 శాతం అధిక కేటాయింపులతో టెండర్లు అప్పగించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్టులు పొందిన వాళ్లు.. ఇప్పుడు చెడ్డవాళ్లయ్యారా అని మంత్రి ప్రశ్నించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పొన్నం మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎంతో అవినీతి జరిగినట్లు కవిత చెప్పారని.. ఆమె ప్రశ్నలకు ఆ పార్టీ నేతలు సమాధానం ఇవ్వలేదన్నారు. హిల్ట్ పాలసీలపైనా ఇలాగే ఆరోపణలు చేశారని.. అసెంబ్లీలో చర్చ పెడితే బహిష్కరించి పారిపోయారని చెప్పారు.


ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జనసేన కార్యకర్త ఇంటికి పవన్

## ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి పరామర్శ -బీమా చెక్కు అందచేత

విజయవాడ,**జనవరి 21ప్రజావినికిడి** :రోడ్డు ప్రమాదంలో చనిపోయిన జనసేన కార్యకర్త వసంతరాయలు కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. పార్టీ క్రయాశీల బీమా చెక్‌ను మృతుని కుటుంబానికి స్వయంగా అందజేశారు. ఈ మేరకు ఆయన కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పెద చందాల గ్రామంలో బుధవారం పర్యటించారు. చందు వీర వెంకట వసంతరాయలు ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన జీవించి ఉండగానే అవయవదానానికి అంగీకరించారు. ఆయన మరణించినప్పటికీ ఆరుగురిలో సజీవంగా ఉంటారని పవన్ చెప్పారు. వారి కుటుంబానికి ప్రభుత్వం సహా తాను బాసటగా ఉంటానని పవన్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు పవన్‌తో పాటు ఎమ్మెల్యేలు కాగిత కృష్ణ ప్రసాద్, మండలి బుద్ధప్రసాద్, రామకృష్ణ, విక్కుర్తి శ్రీనివాస్.. వసంతరాయలు ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా






పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జులైలో వసంతరాయలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. కుటుంబసభ్యులు వసంతరాయలు అవయవాలను దానం చేసి ఐదుగురికి కొత్త జీవితం ఇచ్చారు. అంత బాధలోనూ కుటుంబ సభ్యులు మంచి నిర్ణయం తీసుకున్నందుకు నా ధన్యవాదాలు. నేను స్వయంగా వారితో మాట్లాడి ధైర్యం చెప్పేందుకు వచ్చాను. వారి కుటుంబానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అండగా నిలబడ్డారు. ప్రభుత్వ పరంగా కూడా వారికి చేయూతను ఇవ్వాలని కలెక్టర్‌ను కోరాను. వసంతరాయలు బిడ్డకు వినికిడి లోపం ఉన్నందున ఆపరేషన్ ఉచితంగా చేయించేలా చర్యలు తీసుకుంటాం. టీటీడీ ద్వారా ఆస్పత్రిలో చికిత్సకు ఏర్పాట్లు చేస్తాం. నా రాక సందర్భంగా స్వాగతం పలికిన కూటమి నేతలందరికీ ధన్యవాదాలు' అని అన్నారు.

# అయ్యప్ప సన్నిధిలో రెండో వారం అన్నప్రసాద వితరణ ఘన విజయం



**అనంతగిరి: జనవరి 21ప్రజావినికిడి**
తెలంగాణా శబరిమలగా ప్రసిద్ధిగాంచిన అనంతగిరి శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి సన్నిధిలో గత సంక్రాంతి పండగ నాటి నుంచి ప్రారంభమైన ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం రెండో వారం కూడా విజయవంతంగా నిర్వహించారు. భక్తుల విశేష ఆదరణ మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమానికి అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రసాద్ దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య, అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షులు అర్వపల్లి సత్యనారాయణ, జగిని ప్రసాద్, అనురాగ్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ సురేష్ కుమార్, భూపతి రావు, ముత్తినేని కోటేశ్వరరావు, ఐతబోయిన వెంకటేశ్వర్లు, కక్కిరేణి రామారావు, రమేష్, అర్వపల్లి నాగేందర్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు...పాల్గొన్న పెద్దలు అన్నప్రసాద వితరణ కార్యక్రమం భక్తి, సేవా భావంతో నిరంతరం కొనసాగాలని ఆకాంక్షిస్తూ దాతలను అభినందించారు. భక్తులకు స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని స్వామిని ప్రార్థించారు.

# దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు ఏపీ సిద్ధం...

## యూఏఈకి సీఎం చంద్రబాబు ప్రతిపాదన

**ప్రపంచ ఆర్థిక సదస్సులో యూఏఈ మంత్రితో సీఎం చంద్రబాబు భేటీ**

**ఏపీలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై కీలక చర్చలు**

**పారిశ్రామిక పార్కులు, ఇంధన రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం**

**సీఎం చంద్రబాబు ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన యూఏఈ మంత్రి**

**ఏపీలో ఉన్న మౌలిక సదుపాయాలను వివరించిన ముఖ్యమంత్రి**

స్విట్జర్లాండ్ లోని దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) విదేశీ వాణిజ్య శాఖ మంత్రి డాక్టర్ థాని బిన్ అహ్మద్ అల్ జయేదీతో బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు కీలక రంగాల్లో భాగస్వామ్యం కావాలని యూఏఈని ఆహ్వానించారు. ఈ భేటీలో ప్రధానంగా ఏపీలో 'దుబాయ్ ఫుడ్ క్లస్టర్' ఏర్పాటు ప్రతిపాదనపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.




ఈ సమావేశంలో అగ్రిటెక్, ఫుడ్ టెక్, ఆక్వా టెక్నాలజీలతో పాటు ఫుడ్ పార్కుల అభివృద్ధి, ఆహార భద్రత వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఆక్వా, ఉద్యాన ఉత్పత్తులు అధికంగా ఉన్నాయని, వాటిని ప్రాసెస్ చేసి అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఆహార ఉత్పత్తులను వేగంగా, సులభంగా రవాణా చేయడానికి అవసరమైన పోర్టులు, విమానాశ్రయాలు, రోడ్డు, రైలు మార్గాలతో కూడిన పటిష్టమైన నెట్‌వర్క్ ఏపీలో ఉందని తెలిపారు. అంతేకాకుండా, రాష్ట్రం గుండా వెళ్తున్న జాతీయ పారిశ్రామిక కారిడార్లు లాజిస్టిక్స్‌కు మరింత ఊతమిస్తాయని యూఏఈ మంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో యూఏఈకి చెందిన డీపీ వరల్డ్, షరాఫ్ గ్రూప్, ట్రాన్స్‌వరల్డ్, ఏడీ పోర్ట్స్, యాడ్నాక్ వంటి ప్రతిష్టాత్మక కంపెనీలు ఏపీలో పారిశ్రామిక పార్కులు నెలకొల్పే అవకాశాన్ని పరిశీలించాలని చంద్రబాబు కోరారు. ఏపీ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతితో పాటు, ఇక్కడే ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన రంగంలోనూ ఏపీ అపార అవకాశాలను అందిస్తోందని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు యూఏఈకి చెందిన టాక్వా, మజ్దార్ వంటి కంపెనీలకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా, ఏడీఐఏముబాద్లా, ఏడీక్యూ వంటి యూఏఈకి చెందిన సావరిన్ ఫండింగ్ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చని సూచించారు. వీటితో పాటు, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చేయనున్న స్పేస్, డ్రోన్ సిటీల నిర్మాణంలోనూ యూఏఈ భాగస్వామ్యం కావాలని చంద్రబాబు ప్రతిపాదించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రతిపాదనలు, వివరించిన అవకాశాలపై యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థాని బిన్ అహ్మద్ సానుకూలంగా స్పందించారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని ఆయన ప్రశంసించినట్లు సమాచారం. ఈ సమావేశం ఏపీ-యూఏఈ వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని ఇరువర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# 25న రథసప్తమికి తిరుమలలో ప్రత్యేక వాహన సేవలు

## ఆర్జిత సేవలతో పాటు, విఐపి దర్శనాలు నిలిపివేత

తిరుమల,**జనవరి 21ప్రజావినికిడి**
ఈ నెల 25న రథ సప్తమిని వైభవంగా నిర్వహించాలని తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో బుధవారం తితిదే అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి జిల్లా, తితిదే అధికారులతో శాఖల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రథ సప్తమి నేపథ్యంలో




స్వామివారి ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలు, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవలు రద్దు చేశారు. ఎన్ఆర్ఐలు, చంటి బిడ్డల తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల ప్రివిలేజ్ దర్శనాలూ నిలిపివేస్తున్నట్లు తితిదే వెల్లడించింది. తిరుపతిలో జనవరి 24 నుంచి 26 వరకు స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీని రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతోపాటు బ్రేక్ దర్శనాలకు సంబంధించి జనవరి 24న ఎలాంటి సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తితిదే తెలిపింది. భద్రత, పార్కింగ్, అన్నప్రసాదాలు, లడ్డూలు, రద్దీ నిర్వహణ, స్వచ్ఛ కార్యక్రమాలు, అత్యవసర సేవల విషయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భక్తులను ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, గ్యాలరీల్లో, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రథసప్తమి రోజున వాహన సేవల వివరాలు.. ఇలావున్నాయి. తెల్లవారుజామున 5.30 నుంచి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనం ఉంటుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గరుడ వాహనం తరవాత మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు హనుమంత వాహనం నిర్వహిసతారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు చక్రస్నానం చేపడతారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కల్పవృక్ష వాహనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8 నుంచి 9 గంటల వరకు చందప్రభ వాహనంతో ముగుస్తుంది.

# మున్సిపల్ ఎన్నికలకు జాగృతి దూరం

**ఎవరు కోరినా మద్దతు ఇస్తాం**

**ఫోన్ ట్యాపింగ్ తుదిదశకు చేరుతుందన్న నమ్మకం లేదు**

**మీడియాతో జాగృతి అధ్యక్షురాలు కవిత**

హైదరాబాద్,**జనవరి 21ప్రజావినికిడి**జాగృతి ఇంకా పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారలేదని.. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలపై కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కవిత మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎవరు మద్దతు కోరినా ఇస్తామని కవిత తెలిపారు. అవసరమైన చోట తనతో పాటు జాగృతి నేతలు ప్రచారం చేస్తారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుదిదశకు చేరుతుందనే నమ్మకం తనకు లేదన్నారు. తనలాంటి బాధితులకు న్యాయం జరిగే అవకాశం లేదని చెప్పారు. కావాలనే హరీశ్‌రావుకు సిట్ నోటీసులు ఇచ్చి డైవర్షన్ చేస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశారు. గుంపు మేస్త్రీ, గుంట నక్క కలిసే ఉన్నారంటూ విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో డ్రామా మొదలుపెట్టారని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల సమయంలోనే ఎందుకు విచారణ చేపట్టారని ఆమె ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇప్పట్లో తుది దశకు చేరుతుందని తాను అనుకోవడంలేదని ఆమె చెప్పారు. విచారణ వల్ల తనలాంటి బాధితులకు న్యాయం జరుగుతుందని భావించటంలేదని కవిత అన్నారు. పొలిటికల్ పవర్ బలహీన వర్గాలకు వచ్చినప్పుడే ఆ సమాజం బాగుపడుతుందన్నారు. చాలామంది ఎన్నికల్లో పోటీచేస్తామని అడుగుతున్నారని.. కానీ జాగృతి పూర్తిస్థాయి రాజకీయ పార్టీ కాలేదని వెల్లడించారు. యువత, మహిళలు ఎక్కడ పోటీచేసినా జాగృతి మద్దతిస్తుందని ఆమె స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు బీసీలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం వాటా ఇవ్వకుండానే ప్రభుత్వం ఎన్నికలకు వెళుతోందని విమర్శించారు. జిల్లాల పునర్విభజన ఎప్పుడు జరిగినా సికింద్రాబాద్‌ను జిల్లా చేయాల్సిందేనని కవిత డిమాండ్ చేశారు. పీవీ.నరసింహారావు పేరు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని కూడా కవిత కోరారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఉద్యోగులు, యువతకు నష్టం జరిగిందని కవిత విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్‌గా మార్చడంతో రాష్ట్ర



యువతకు నష్టం జరుగుతోందని తెలిపారు. జాగృతి తరఫున అధ్యయనం చేస్తున్నామని.. జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామని తెలిపారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నాటికి పక్రియ పూర్తవుతుందో లేదో చూడాలని కవిత అన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని తెలిపారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదని.. తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ అంశానికి కూడా న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు లేదని అన్నారు. నైని బొగ్గు గని అంశం కంటే సింగరేణికి కొత్త బొగ్గు గనులు వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ విధానం ఎప్పటి నుంచో ఉందని.. కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిబంధనగా పెట్టారని.. కొంత మందికి మాత్రమే సెలెక్టివ్‌గా ఇస్తున్నారని తెలిపారు. విచారణ చేయించాల్సిన కాంగ్రెస్ నేతలు లేఖ రాయాలని కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. జాగృతి అధికారంలోకి వచ్చిన తర్వాత.. 2014 నుంచి సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు. గతంలో సర్పంచ్‌లను కలవని వారు ఇప్పుడు వారితో కలిసి ఫోటోలు దిగుతున్నారని.. ఇది సంతోషించదగ్గ విషయమన్నారు . దాంతో సామాజిక తెలంగాణ వైపు కొంత మేర అడుగులు పడుతున్నాయని చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారన్న అంశం గురించి తనకు తెలీదని, తాను ఇప్పుడు బీఆర్ఎస్‌లో లేనని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ 300 డివిజన్ల ప్రతిపాదన బీఆర్ఎస్ హయాంలోనిదే అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కొనసాగిస్తోందన్నారు. జాగృతి జనంబాట ముగింపు మార్చి పదో తేదీన అనుకుంటున్నామని.. ఆ తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ మంత్రుల అవినీతిపై ర్యాంకులు ప్రకటిస్తామని కవిత పేర్కొన్నారు.'నా టా÷-గ్గ÷ట్ హరీశ్ రావు, ఇంకా పెద్ద టా÷-గ్గ÷ట్ కూడా ఉంది. కేటీఆర్‌ను కూడా విమర్శించాను. బలమైన రాజకీయ భవిష్యత్ కోసం పటిష్ట ఎజెండా సిద్ధం చేసుకుంటున్నాను, ఈ దశలో నాకు నేనుగా ఎవరితోనూ మాట్లాడను. రాజకీయ కన్‌స్టలెన్సీలు ఎవరినీ నేను సంప్రదించలేదు, నన్ను సంప్రదించిన కొంత మందితో మాట్లాడాను' అని కల్వకుంట్ల కవిత వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులు ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారులను పట్టించుకోలేదని విమర్శించారు. ట్యాంక్‌బండ్ మీద ఆంధ్రావారి విగ్రహాలు తప్ప తెలంగాణ మహనీయులవి లేవని.. వాళ్ల విగ్రహాలు తొలగించాలని తాము అనటం లేదని.. అవసరం వస్తే తప్పదంటూ వ్యాఖ్యానించారామె. అమరజ్యోతిపై అవినీతి మరకలు పడ్డాయని, అందుకే దాన్ని ఓపెన్ చేయడంలేదని కవిత అన్నారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఉద్యమకారుల విగ్రహాలు ఉండాలన్నారు. ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహం అక్కడ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఐదు శాతం ఓపెన్ కోటాను నాన్ లోకల్ గా మార్చడంతో రాష్ట్ర యువతకు నష్టం జరుగుతోందన్నారు. జాగృతి తరఫున అధ్యయనం చేస్తున్నాం, జిల్లాల పునర్విభజన కమిషన్ ఏర్పాటు చేస్తే నివేదిక ఇస్తామన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు కసరత్తు వేగంగా జరుగుతోందని.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల నాటికి పక్రియ పూర్తవుతుందో లేదో చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద కూడా అడ్డంకులు సృష్టించే అవకాశం లేకపోలేదని అభిప్రాయపడ్డారు. పార్టీకి ఇంకా ఏ పేరు అనుకోలేదు, తెలంగాణ రాష్ట్ర జాగృతి సమితి అని కొందరు సూచించారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏ అంశానికి కూడా న్యాయం చేస్తారన్న నమ్మకం తనకు లేదని.. నైనీ బొగ్గు గని అంశం కంటే సింగరేణికి కొత్త బొగ్గు గనులు వచ్చేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ ఆ అంశం గురించి మాట్లాడకుండా నైనీ అంశాన్ని పట్టుకొంది.. సింగరేణిలో సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ విధానం ఎప్పట్నుంచో ఉంది, కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాన్ని ప్రధాన నిబంధనగా పెట్టారు, కొంత మందికి మాత్రమే సెలెక్టివ్ గా ఇస్తున్నారని కవిత అన్నారు. విచారణ చేయించాల్సిన కాంగ్రెస్ నేతలు లేఖ రాయాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు.

# ఎసిబికి చిక్కిన హన్మకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి

## వందకోట్ల ఆస్తులు గుర్తింపు..కొనసాగుతున్న విచారణ

హన్మకొండ**జనవరి 21ప్రజావినికిడి** :తెలంగాణలో అవినీతి అధికారుల భరతం పడుతున్న ఏసీబీ, తాజాగా హన్మకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించి మరో భారీ కుంభకోణాన్ని వెలుగులోకి తెచ్చింది. ఒక ఫైల్ ప్రాసెసింగ్ కోసం లంచం డిమాండ్ చేస్తూ ఏసీబీ అధికారులకు చిక్కిన వెంకట్ రెడ్డి అక్రమ సామ్రాజ్యం వందల కోట్లలో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. హైదరాబాద్, నల్గొండ, మిర్యాలగూడ , హన్మకొండలోని ఆయనకు సంబంధించిన నివాసాల్లో ఏకకాలంలో నిర్వహించిన ఈ సోదాల్లో సుమారు 100 కోట్ల విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించారు. ఈ సోదాల్లో అధికారులు విస్తుపోయే రీతిలో ఆస్తులను కనుగొన్నారు. ఎల్‌బీ నగర్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో రెండు విలాసవంతమైన విల్లాలు, వివిధ ప్రాంతాల్లో 10 ప్లాట్లు , 14 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు వెంకట్ రెడ్డి నివాసం , బ్యాంక్ లాకర్ల నుండి సుమారు 2 కిలోల బంగారం, 0 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్‌ను అధికారులు గుర్తించారు. తన అధికారిక పదవిని అడ్డం పెట్టుకుని బినామీల పేరుతో భారీగా ఆస్తులు కూడబెట్టిన ఈ అధికారి వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. ప్రస్తుతం ఏసీబీ అధికారులు దాడులను ముగించి, స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా విచారణను వేగవంతం చేశారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# బడ్జెట్‌పై కసరత్తు షురూ

**హైదరాబాద్‌లో24 నుంచి రాష్ట్ర పద్దుపై సన్నాహక సమావేశాలు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో ఫిబ్రవరి 5 వరకు నిర్వహణ**

**సంక్షేమ పథకాల నిధుల కేటాయింపుపై కీలక చర్చ**




**హైదరాబాద్‌జనవరి 21ప్రజావినికిడి**
రాష్ట్ర బడ్జెట్ 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కసరత్తు వేగవంతమైంది. బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించిన పనులు గతనెలలోనే ప్రారంభమై విషయం తెలిసిందే. ఆర్థిక శాఖ అధికారులు ఈ పనిలోనే నిమగమయ్యారు. గతనెల 23 నుంచి ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో శాఖల వారీగా ఆన్‌లైన్‌లో బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పించాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ఇప్పుడు భౌతికంగా ఈనెల 24 నుంచి శాఖల వారీగా ఆర్థిక శాఖ సన్నాహక సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఈ సమావేశాలు సచివాలయంలో జరుగుతాయి. ఆయా శాఖల మంత్రులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ప్రత్యేక కార్యదర్శులు, ఆయా శాఖల విభాగాధిపతులతో వచ్చేనెల ఐదో తేదీ వరకు ఈ సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది.
ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా బుధవారం బడ్జెట్ ప్రతిపాదనలకు సంబంధించిన సమావేశాల షెడ్యూల్‌ను విడుదల చేశారు. సంక్షేమ పథకాలకు సంబంధించి నిధుల కేటాయింపుపై కీలకంగా చర్చ జరుగుతుంది. ఏయే సంక్షేమ పథకానికి ఎన్ని నిధులు కేటాయించాలో నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. శాఖల వారీగా ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, కొత్త పథకాల ప్రారంభం వంటి వాటిపైనా చర్చించి నిర్ణయం తీసుకుం టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆ వివరాలను ప్రకటి స్తుంది. ఈనెల 24న మొదటి వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశం ఉంటుంది. అదేరోజు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా,శిశు సంక్షేమ శాఖమంత్రి డి అనసూయ సీతక్కతో సమావేశాన్ని నిర్వహిస్తారు. 27న ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సమావేశం ఉంటుంది. 28న ఉదయం నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో, మధ్యాహ్నం పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో సమావేశముంటుంది.
29న ఉదయం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో, మధ్యాహ్నం ఎక్సైజ్, పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశాన్ని నిర్వహిస్తారు. 30న కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మధ్యాహ్నం పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో సమావేశం ఉంటుంది. 31న ఉదయం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో, మధ్యాహ్నం మైనార్టీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ మంత్రి అజహరుద్దీన్‌తో సమావేశాన్ని నిర్వహిస్తారు. వచ్చేనెల రెండో తేదీన ఉదయం ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో, మధ్యాహ్నం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో సమావేశముంటుంది. అదేనెల మూడున ఉదయం విద్యారంగం, మధ్యాహ్నం మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తారు. నాలుగున ఉదయం సాధారణ పరిపాలన శాఖతోపాటు రెవెన్యూ శాఖ, మధ్యాహ్నం హోం, న్యాయ శాఖల అధికారులతో సమావేశం ఉంటుంది. చివరి రోజు వచ్చేనెల ఐదున ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ శాఖలపై సమావేశాన్ని నిర్వహిస్తారు.

## హైదరాబాద్‌లో తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్

### సిఎం రేవంత్‌తో లోరియల్ సంస్థసిఇవో భేటీ



దావోస్,**జనవరి 21ప్రజావినికిడి** ప్రపంచంలోనే తొలి బ్యూటీ టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించింది. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుంది. దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ?టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారు. ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుంది. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుంది. నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లను లోరియల్ ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని చెప్పారు. మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ?టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారు. ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్ , కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ (÷ంఎఊ) గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించింది. జీసీసీతో పాటు మాన్యుఫాక్షరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారు.

## ఎస్సీ,ఎస్టీ పారిశ్రామికవేత్లకు ఊరట

### ప్రోత్సాహక మొత్తాలను విడుదల చేసి ప్రభుత్వం

అమరావతి,జ**జనవరి 21ప్రజావినికిడి**రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజన పారిశ్రామికవేత్తలకు భారీ ఊరటనిచ్చింది. రెండో విడత పారిశ్రామిక ప్రోత్సాహకాలను విడుదల చేసింది. ఈ విడతలో మొత్తం 3,617 మంది ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.60.21 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.3,122 మంది ఎస్సీ పారిశ్రామికవేత్తలకు రూ.53.05 కోట్లు, 495 మంది ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రూ.7.16 కోట్ల ప్రోత్సాహకాలను విడుదల చేసినట్లు రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. దళిత, గిరిజన వర్గాల పారిశ్రామికవేత్తలను ఆర్థికంగా బలోపేతం చేసి, వ్యాపార రంగంలో ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు మొత్తం 11,451 మంది పారిశ్రామికవేత్తలకు రూ.269.9 కోట్ల విలువైన పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందించినట్లు మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.

## రాజదాని అమరావతికి చట్టబద్దత

### పార్లమెంట్‌లో బిల్లు ద్వారా ఆమోదించే అవకాశం

అమరావతి,**జనవరి 21ప్రజావినికిడి** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని చట్టబద్ధంగా ప్రకటించేందుకు రంగం సిద్ధమైంది. అమరావతిని రాజధానిగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అధికారికంగా వినతిపత్రం సమర్పించింది. 2024 జూన్ 2తో ఉమ్మడి రాజధాని గడువు ముగియడంతో.. ఏపీకి రాజధానిని తప్పక ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో, రాజధానిగా అమరావతి ఎంపిక ప్రక్రియ, నిర్మాణ కార్యక్రమాలపై వివరాలను కూడా కేంద్రానికి నోట్ ద్వారా అందించారు. ఈ విషయమై.. కేంద్రం ఇప్పటికే అన్ని మంత్రిత్వ శాఖల నుంచి అభిప్రాయాలు సేకరించేసి, నీతి ఆయోగ్ అభిప్రాయాన్ని కూడా కోరినట్లు సమాచారం. ఈ ప్రక్రియ పూర్తయ్యాక పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా ప్రకటించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ ప్రభుత్వం సూచించిన ప్రకారం.. 2024 జూన్ 2 నుంచి అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటించేందుకు అన్ని చర్యలు కొనసాగుతున్నాయని తెలుస్తోంది.

## గణతంత్ర దినోత్సవ వేళ ఉగ్రదాడులకు ప్లాన్

### హెచ్చరించిన నిఘా వర్గాలు

న్యూఢిల్లీ,**జనవరి 21ప్రజావినికిడి**: గణతంత్ర దినోత్సవాన్ని లక్ష్యంగా చేసుకుని భారత్‌లో ఉగ్రదాడులు జరిగే అవకాశాలున్నాయని నిఘా వర్గాల తాజా సమాచారం. ఈ సమాచారంతో ఢిల్లీలో భద్రతా బలగాలు బుధవారంనాడు అప్రమత్తమయ్యాయి. పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు సహకరించనున్నట్టు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. జనవరి 26న దేశంలోని పలు ప్రాంతాల్లో జరిపే ఈ దాడులకు '26–26' అనే కోడ్ నేమ్ పెట్టినట్టు తెలిపాయి. దేశంలోని పలు ఆలయాలు, నగరాలతో పాటు అయోధ్యలోని రామాలయం, జమ్మూలోని రఘునాథ్ ఆలయం ఉగ్రవాదుల టా÷–గ్గ÷ట్‌లో ఉన్నట్టు భద్రతా బలగాలు తెలిపాయి. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్, పంజాబ్ బేస్డ్ గ్యాంగ్‌స్టర్లతో ఐఎస్ఐ ఈ ఉగ్రదాడులకు ఎ÷–లాన్ చేస్తున్నట్టు పేర్కొన్నాయి. గత నవంబర్‌లో ఎర్రకోట వెలుపల జరిగిన కారుబాంబు పేలుడు ఘటన వెనుక జైషే మహ్మద్ ఉంది. కాగా, నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన అధికారులు జమ్మూకశ్మీర్, ఢిల్లీ, పంజాబ్ వంటి కీలక ప్రాంతాల్లో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. అనుమానితుల పోస్టర్లను ఢిల్లీలో పలు చోట్ల ఏర్పాటు చేశారు. ప్రధానంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో వీటిని ఉంచారు.గత ఏడాది ఏప్రిల్‌లో లష్కరే తొయిబా ఉగ్రసంస్థ పహల్గాంలో జరిపిన ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు ప్రాణాలు కోల్పోయారు. గత వారం లష్కరే సంస్థ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదానికి కట్టుబడి ఉన్నామని బహిరంగంగా ప్రకటించింది. హిందువులకు వ్యతిరేకంగా లష్కరే కమాండర్ విద్వేషపూరిత ప్రసంగం చేశాడు. హిందువుల కుత్తుకలు కోసినప్పుడే 'ఫ్రీడం' సాధ్యమని పీఓకేలో జరిగిన ఒక కార్యక్రమంలో అబూ మూసా కశ్మీరీ చేసిన ప్రసంగం వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా కశ్మీరీ ఇలాంటి వ్యాఖ్యలే చేశాడు. దీంతో భారత్‌పై దాడులకు మరింత భారీ కుట్ర చేసే అవకాశాలు ఉండవచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

## రాజకీయ ప్రయోగశాలగా సింగరేణి

**బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పయనం**

**అన్ని రకాలుగా సింగరేణి విధ్వంసం**

**ప్రభుత్వం కోరితే సిబిఐ విచారణకు సిద్ధం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



న్యూఢిల్లీ,**జనవరి 21ప్రజావినికిడి**: సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ విధ్వంసం చేస్తున్నాయని్గ ÷ర్ అయ్యారు. నైనీ కోలి విషయంలో కేంద్రం సహకారం అందిస్తోందన్నారు. ఢిల్లీలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశారు. బీఆర్ఎస్ ఎలా పనిచేసిందో కాంగ్రెస్ అలానే పనిచేస్తుందన్నారు. దేశ బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. అయితే, తెలంగాణ వచ్చాక సింగరేణికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. సింగరేణి విషయంలో వివాదం నెలకొన్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు సింగరేణిని అన్ని రకాలుగా విధ్వంసం చేశాయని ఆరోపించారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. సింగరేణి రాజకీయ ప్రయోగశాలగా మారిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అనేక రకాల అక్రమాలు జరిగాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలకు విద్యుత్ కోసం తెలంగాణకు నైనీ కోల్ బ్లాక్ కేటాయించారు. దానికి కేంద్రం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలున్నాయి. గతంలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల ప్రక్రియలో సీఎం జోక్యం చేసుకొని రద్దు చేశారు. సింగరేణి మైనింగ్‌కు ముందుకొస్తే బీఆర్ఎస్ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిందన్నారు. బొగ్గు గనుల కొరత ఉందని తెలిసి ప్రైవేటు వ్యక్తులకు ఎలా ఇస్తారని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. సింగరేణి, నైనీ కోల్ బ్లాక్ అక్రమాలపై చర్చ జరగాలని, సీబీఐ దర్యాప్తునకు రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఒడిశాలో బీజేపీ వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించాను. నైనీ బొగ్గు గనులకు చివరి పర్మిషన్ వచ్చాక పనులు ఎందుకు ఆలస్యం చేశారు? బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. ఆరోజు కొందరు వ్యక్తులకు లాభంగా చేకూరేలా వ్యవహరించారు. సింగరేణి అక్రమాలపై సీబీఐదర్యాప్తు జరగాలి. రాష్ట్రం ముందుకొస్తే కేంద్రం పరిశీలిస్తుంది. సింగరేణి మైనింగ్కు ముందుకు వస్తే, చెయ్యలేమని ప్రైవేట్ కు కట్టబెట్టారు. సంస్థని బెదిరించి లేఖ రాయించారు. ఈ వివాదంలోకి నన్ను కూడా లాగుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం చేసింది.. సింగరేణి భవిష్యత్తు ప్రమాదకరంగా మార్చారు. సంస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని అన్నారు. కలో ఇండియాలో విలీనంపై మాట్లాడుతూ పరిశీలిస్తున్నామని అన్నారు. మెట్రో రెండో దశ తదితర అంవాలపైనా ఆయన తన అభిప్రాయాలు వెల్లడించారు. అందుకే సిఎంకు లేఖరాశానని అన్నారు.

## రాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడగలరా

**నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం**

**టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**



నిజామాబాద్,**జనవరి 21ప్రజావినికిడి**
శ్రీరాముడి పేరు చెప్పకుండా ఎన్నికల్లో నిలబడే దమ్ము బీజేపీకి ఉందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజామాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. కాంగ్రెస్ తోనే నిజామాబాద్ అభివృద్ధి సాధ్యమని అన్నారు బుధవారం నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ బీజేపీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని.. వాటిపై నోటీసులు ఇస్తే బాధ ఎందుకని అన్నారు.సింగరేణి విషయంలో పస లేని ఆరోపణలు చేస్తున్నారని..
సింగరేణి కాంట్రాక్టులు బీఆర్ఎస్ హయాంలో జరిగినవి అని అన్నారు. ఆరోపణలపై ఆధారాలు ఉంటే చర్చకు సిద్ధంగా ఉన్నామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 20 శాతం ఎక్సెస్ టెండర్లు జరిగాయని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినాక అన్ని శాఖలను ప్రక్షాళన చేశామని.. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను సరిదిద్దుతున్నామని అన్నారు. కేటిఆర్, హరీష్ రావులు బట్ట గాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని.. ఎన్నికల లబ్ధికోసం నోటీసులు ఇస్తున్నారనేది సమంజసం కాదని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ అనేది అత్యంత నేరం..అలాంటి నేరం బీఆర్ఎస్ నాయకులు చేసారని.. సినీ నిర్మాత తారలు,స్వంత పార్టీ ఎమ్మెల్యేల ఫోన్ లు కూడా ట్యాప్ చేసారని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిట్ విచారణలో రాజకీయ కక్ష కోణం ఎక్కడా లేదని.. నిజంగా తప్పు చేయకుంటే వివరణ ఇచ్చే ప్రయత్నం చేయాలని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన సింగరేణి కాంట్రాక్టులు, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన టెండర్లపై చర్చకు రావాలని అన్నారు మహేష్ కుమార్ గౌడ్. సిఎం బంధువు సృజన్ రెడ్డిపై ఆరోపణలు చేసి దెబ్బ తీయాలనే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

# లోక్‌పాల్ తోనే రాజకీయ అవినీతికి అడ్డుకట్ట !

**జనవరి 21ప్రజావినికిడి**

త్వం శుంఠ అంటే..త్వం శుంఠ అన్నట్లుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు నడుస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అవినీతికి తెగించడం..వేలకోట్లు సంపాదించడం..అధికారం పోయాక, అధికారంలో ఉన్న పార్టీల అవినీతి గురించి ప్రశ్నించడం చూస్తున్నాం. అధికారంలో ఉన్న వారు, అధికారంలో ఉండి విపక్షం లోకి వచ్చిన వారు చేసిన అవినీతి వల్ల ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో కోలుకోలేని అప్పుల్లో కూరుకుని పోయాయి. ఇది వాస్తవం. విభజన వల్ల జరిగిన మేలు ఇదే. ఇందుకు నాలుగు పార్టీల నాయకులు బాధ్యులు. బిఆర్ఎస్‌గా మారిన టిఆర్ఎస్, కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు ఈ అప్పులకు బాధ్యత వహించాలి. తెలుగు రాష్ట్రాల అప్పులను ఈ పార్టీల నుంచి వసూలు చేయాలి. అప్పుడే ఈ రెండు రాష్ట్రాలు అప్పుల ఊబినుండి బయటపడతాయి. ఇకపోతే నేతలకు సవాళ్లు విసురకోవడం అలవాటుగా మారింది. అధికారంలో ఉండగా తాము చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకు, ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీలను నిందస్తున్నారు. ఇందులో ఎవ్వరేమీ తక్కువ తినలేదు. అందుకే రాజకీయ అవినీతిపై ఉన్నతస్థాయి దర్యాప్తు జరగాలి. సాధారణ పోలీసులతో ఇది సాధ్యం కాదు. ప్రత్యేక వ్యవస్థను రూపొందించాలి. అన్నా హజారే కోరినట్లుగా లోక్‌పాల్ వ్యవస్థను తీసుకుని రావాలి. అప్పుడే స్వతంత్ర దర్యాప్తు కొనసాగుతుంది. అవినీతిపై నిగ్గు తేలుస్తారు. రాజీకయ పార్టీలు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలకు చట్టాలు తేవాలి. ప్రస్తుత సమాజంలో బాగా వేళ్లూనుకున్న అవినీతి ఎక్కడయినా ఉందంటే అది రాజకీయ పార్టీల్లోనే. పటిష్ట లోక్‌పాల్ వ్యవ్‌స్థ ద్వారానే అవినీతి నేతలను శిక్షించగలం. అందుకు ప్రజా ఉద్యమాలు రావాలి. ఆప్ ఉద్యమంలా కాకుండా ప్రజలు, మేధావులు కలసి ఉద్యమించాలి. ఇక తెలుగు రాష్ట్రాల విషయాలకు వస్తే జగన్, వైకాపా అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కెసిఆర్, ఆయన కుటుంబం, బిఆర్ఎస్ నేతల అవినీతిపైనా చర్యలు ముందుకు సాగడం లేదు. తాజాగా కాంగ్రెస్ అవినీతి బట్టబయలు అయ్యింది. ఈ క్రమంలో వీరి అవినీతిపై చర్యలు ఉంటాయనుకోవడం కూడా అత్యాశే అవుతుంది. తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. రెండేళ్లుగా సాలీడు దారంలా సాగుతోంది. ఇందులో భాగంగా తాజాగా మాజీ మంత్రి హరీష్‌రావును సిట్ అధికారులు 7 గంటలపాటు విచారించారు. సిట్ విచారణపై ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే నాకు నోటీసులు ఇవ్వడం కాదని, రాజకీయంగా కోట్లాడుదాం అని హరీష్ రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం సహా అనేక అవినీతి కేసులు ఉన్నా ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. వారి అవినీతిని ప్రశ్నిస్తున్న అధికార కాంగ్రెస్ నేతలు తామూ అవినీతి బురదలో కూరుకు పోయారు. ఒక్కో మంత్రి మీద ఒక్కో అవినీతి బయటపడుతోంది. దీనినిబట్ట అవినీతి రాజకీయ పార్టీల హక్కుగా మారిందని అర్థం చేసుకోవాలి. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేసు, కాళేశ్వరం వంటివననీ పిచ్చకుంట్ల, లొట్టపీసు కేసులని బిఆర్ఎస్ వాదిస్తోంది. కాగ్రెస్ పై ప్రజలు తిరగబడే రోజులు దగ్గర లోనే ఉన్నాయని హరీష్ రావు వ్యాఖ్యానించడం, ఆయన తప్పించుకునే రాజకీయ తెలివిని ప్రదర్శించారని గుర్తించాలి. ఇకపోతే సింగరేణి సంస్థ నిబంధనలు మార్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బావమరిదికి రూ.1,600 కోట్ల టెండర్లు కట్టబెట్టారని బిఆర్ఎస్ నేతలు




ఆరోపిస్తున్నారు. బొగ్గు కుంభకోణంపై నిగ్గు తేల్చడం కోసం సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ అనేక కుంభకోణాలకు పాల్పడిందని, రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు. మంత్రుల వద్ద వాటాల పంచాయితీ నడుస్తున్నదని దుయ్యబట్టారు. గతంలో సింగరేణిపై ఏ ప్రభుత్వం కూడా అజమాయిషి చేయలేదని, కానీ, రేవంత్ సర్కార్ మాత్రం అజమాయిషీ
చేస్తూ, తద్వారా సంస్థను నిర్వీర్యం చేస్తున్నదని దుయ్యబట్టారు. మొత్తానికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని అంటారు. అవినీతి ఆరోపణలను అవినీతి ఆరోపణలతో తిప్పికొట్టడం ఇప్పుడు రాజకీయ పార్టీలకు అలవాటుగా మారింది. సింగరేణి సంస్థకు నష్టం చేకూరేలా చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చినప్పుడు దానిని సరిదిద్దుకొని సంస్థ ఖజానాకు గండి పడకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీది. సింగరేణిపై కాంగరెస్, బిఆర్ఎస్ పార్టీలు గద్దల్లా పడి దోచుకుంటున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆరోపించారు. బొగ్గు మంత్రిగా ఉన్నా కిషన్ రెడ్డి ఏం చేస్తున్నట్లు అన్నది చెప్పాలి. కేంద్రం నిజాయితీగా ఎందుకు వ్యవహరించడం లేదు. అవినీతిపరులను ఎందుకు బోను ఎక్కించడం లేదు. ఇవన్నీ శేష ప్రశ్నలు. సాధారణ టెండర్లలోనూ బిడ్ వేసే ముందు కాంట్రాక్టర్లు పనిచేసే ప్రాంతాన్ని సందర్శించి టెండర్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివరాలతో బేరీజు వేసుకుంటారు. ప్రీబిడ్ సమావేశంలో తమ అనుభవాలు, సమస్యలు, అభ్యంతరాలను అధికారుల ముందు ఉంచి పరిష్కారాలు, వెసులుబాట్లను ప్రతిపాదిస్తారు. కానీ సింగరేణి టెండర్లు మైనింగ్‌కు సంబంధించినవైనందున భౌగోళిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అవినీతి వ్యవహారాలు పునరావృతం కాకుండా ఉండాలంటే కచ్చితంగా టెండర్ నోటిఫికేషన్‌లోనే కొత్త షరతులు పెట్టాల్సి ఉంటుంది. ఒడిశా అంగూల్ జిల్లాలోని నైని కోల్‌బ్లాక్‌ను 2015లో దక్కించుకున్న సింగరేణి సంస్థ, 2200 ఎకరాల విస్తీర్ణంలోని ఆ బ్లాకులో 200 ఎకరాల విస్తీర్ణానికి బీఆర్ఎస్ హయాంలోనే టెండర్లు పూర్తి చేసి, పనులు అప్పగించింది. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో ఐదేండ్ల పాటు బొగ్గు వెలికితీతకు పిలిచిన ఆ టెండర్లలో ఐదు సంస్థలు పోటీపడ్డాయి. చివరికి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి చెందిన వీపీఆర్ సంస్థ టెండర్ దక్కించుకున్నది. రోజుకు 30వేల క్యూబిక్ మీటర్ల ఓబీని ఈ సంస్థ వెలికి తీస్తున్నది. అతను కూడా రాజకీయ పార్టీకి చెందిన వాడే ఆవడంతో అవినీతికి ఆస్కారం ఏర్పడింది. టెండర్ విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలనుకుంటే సైట్‌ను పరిశీలించిన ప్రతి కంపెనీకి ఇప్పటికే సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నది. ఆ మేరకు సుశీ కంపెనీతో పాటు పలు కంపెనీలు కూడా పదేపదే అధికారులకు ఫోన్ చేసి తమకు సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతున్నా అధికారులు జారీ చేయలేదంటే.. ప్రభుత్వ పెద్దల ఆదేశాల కోసం వేచి చూస్తున్నారనేది బహిరంగ రహస్యం. అయితే నైనీ టెండర్లకు సంబంధించి అసలు ఈ సర్టిఫికెట్ ఎవరు జారీ చేయాలనే దానిపైనా సింగరేణిలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతుందంటే పక్రియ ఎంత గుడ్డిగా కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ వ్యవహారంలో విచారణ జరగాలి. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో వస్తున్న ఆరోపణలపై విచారణ జరగాలి. బిఆర్ఎస్ పదేళ్ల పాపాలపైనా విచారణ సాగాలి. చంద్రబాబు, జగన్ పాపాలపైనా విచారణ జరగాలి. అందుకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం.

---

## సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేషపూరితమే అన్న మద్రాస్ హైకోర్టు

చెన్నై,**జనవరి 21ప్రజావినికిడి**



:తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 2023లో సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేష పూరితమైనవే అని మద్రాస్ హైకోర్టు తప్పుపట్టింది. ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై మద్రాస్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సనాతన ధర్మంపై ఉదయనిధి వ్యాఖ్యలు విద్వేషపూరిత ప్రసంగమేనని వ్యాఖ్యానించింది. ఉదయనిధి వ్యాఖ్యలను విమర్శిస్తూ.. భాజపా నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టడంపై దాఖలైన కేసును హైకోర్టు కొట్టేసింది. ఉదయనిధి 2023లో చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ.. మాలవీయ చేసిన పోస్టు నేరం కిందకు రాదని పేర్కొంది. సనాతన ధర్మాన్ని అనుసరించేవారే లక్ష్యంగా చేసిన రెచ్చగొట్టే ప్రసంగానికి అది ప్రతిస్పందన మాత్రమేనని స్పష్టం చేసింది. ఉదయనిధి ఉపయోగించిన పదజాలంపై అసహనం వ్యక్తంచేస్తూ.. ఆయన చేసిన వ్యాఖ్యలు విద్వేష పూరిత ప్రసంగం కిందకే వస్తాయని పేర్కొంది. తమిళనాడులో మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఎలాంటి కేసు నమోదు కాలేదని, ఇతర రాష్ట్రాల్లో కొన్ని కేసులు నమోదైన విషయాన్ని ప్రస్తావించింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అని వ్యాఖ్యానించారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది.

## మావోయిస్టు అడ్డాలో పోలీసుల పాగా

### కర్రెగుట్టలో వెలిసిన సిఆర్‌పిఎఫ్ క్యాంప్

ములుగు,**జనవరి 21ప్రజావినికిడి**

దశాబ్దాలుగా మావోయిస్టులకు సురక్షిత ప్రాంతంగా, వారి ఆయుధ కర్మాగారాలకు , ముఖ్య నాయకులకు షెల్టర్ జోన్‌గా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతం ఇప్పుడు పోలీసుల అధీనంలోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మావోయిస్టు రహిత భారత్ లక్ష్యంలో భాగంగా, వెంకటాపురం మండలం పామునూరు గ్రామ పరిధిలోని కర్రెగుట్టలపై నూతనంగా ఎఫ్.ఓ.బి బేస్ క్యాంప్‌ను అధికారులు ప్రారంభించారు. సి.ఆర్.పి.ఎఫ్ 39వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ బేస్ క్యాంప్‌ను సి.ఆర్.పి.ఎఫ్ ఐజీ త్రివిక్రమ్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇది దేశ భద్రతా చరిత్రలో ఒక గొప్ప రోజని అభివర్ణించారు. తెలంగాణ ప్రభుత్వ చొరవతో, మురుమూరు బేస్ క్యాంప్ ఏర్పాటు చేసిన కేవలం రెండు నెలల వ్యవధిలోనే దుర్భేద్యమైన కర్రెగుట్టలపై




పట్టు సాధించి ఈ రెండో క్యాంప్‌ను ఏర్పాటు చేయడం విశేషమని ఆయన కొనియాడారు. ఈ బేస్ క్యాంప్ ఏర్పాటు వెనుక అధికారుల , ఇంజనీర్ల అలుపెరగని కృషి దాగి ఉంది. వాజేడు మండలం మొరుమూరు బేస్ క్యాంప్ నుండి కర్రెగుట్టల వరకు సుమారు 8.3 కిలోమీటర్ల మేర దట్టమైన అటవీ ప్రాంతంలో రహదారిని నిర్మించారు. భారీ యంత్రాలు, క్రైన్‌ల సహాయంతో గుట్టలపై విశాలవంతమైన రహదారిని నిర్మించడానికి అధికారులు సుమారు 50 రోజుల పాటు అహోరాత్రులు శ్రమించారు. ఈ రహదారి నిర్మాణం పూర్తి కావడంతో ఇప్పుడు బలగాల రాకపోకలు సులభతరం కావడమే కాకుండా, మావోయిస్టుల కదలికలకు అడ్డుకట్ట పడింది. బేస్ క్యాంప్ ప్రారంభం అనంతరం ఐజీ విక్రమ్ పామునూరు గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న రోజుల్లో జెల్లా, డోలి, తడపాల మీదుగా మరిన్ని రహదారులు నిర్మించి బేస్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టుల ముఖ్య క్యాడర్ ఇప్పటికే లొంగిపోయారని, ప్రస్తుతం కొన్ని చిన్న పార్టీలు మాత్రమే మిగిలి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వారు కూడా తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చిన 'పోరు కన్నా ఊరు మిన్న' కార్యక్రమం ద్వారా లొంగిపోయి, ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాసాన్ని అందిపుచ్చుకుని జనజీవన స్రవంతిలో కలవాలని ఆయన పిలుపునిచ్చారు.

కర్రెగుట్టల నుంచి పలు గ్రామాల దిశగా రహదారి పనులు చకచకా సాగుతుండటంతో స్థానిక గిరిజన గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ పథకాలు నేరుగా తమ దరికి చేరుతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల రాకతో భద్రతా భావం పెరిగిందని, కర్రెగుట్టలు ఇకపై మావోయిస్టుల స్థావరాలుగా కాకుండా అభివృద్ధికి కేంద్రాలుగా మారుతాయని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## నాకేదైనా జరిగితే ..ఇరాన్ ఔట్

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



వాషింగ్టన్,**జనవరి 21ప్రజావినికిడి**ఇరాన్‌ను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనపై ఇరాన్ హత్యకు పాల్పడితే.. ఆ దేశాన్ని అమెరికా భూస్థాపితం చేస్తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో ఓ మీడియా సంస్థ ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఏదైనా హత్యాయత్నం జరిగి, దాని వెనక ఇరాన్ హస్తం ఉందని తేలితే.. ఆ దేశాన్ని తుడిచిపెట్టేయాలని తన సలహాదారులను ఆదేశించినట్లు ట్రంప్ ఇప్పటికే ఓసారి వ్యాఖ్యలు చేశారు. తాజాగా మరోసారి అదేతరహా హెచ్చరికలు చేశారు. కాగా.. డిసెంబర్ నుంచి పాలకులకు వ్యతిరేకంగా ఇరాన్ ప్రజలు నిరసనలు చేపడుతున్నారు. దీంతో తమ దేశంలో నెలకొన్న ఆందోళనలకు అమెరికా అధ్యక్షుడే కారణమని ఆయతుల్లా అలీ ఖమేనీ ఆరోపించగా.. ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆ నిరసనకారులకు ట్రంప్ మద్దతు పలుకుతున్న సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఖమేనీ పాలన అంతం కావాలని పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ (ఎసజీని) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ నాయకుడే లక్ష్యంగా ఏదైనా దురాక్రమణ జరిగితే.. దానిని తాము దీటుగా ఎదుర్కొంటామని హెచ్చరించింది. ఇక ఈ నిరసనల్లో 5వేల మంది మృతి చెందినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. 26వేల మంది వరకు అరెస్టయినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ మరణాలకు అమెరికానే కారణమని ఖమేనీ నిందించారు.

## దావోస్ వేదికపై చిరు ప్రత్యక్షం

### సిఎం రేవంత్‌తో కలసి సదస్సుకు హాజరు

హైదరాబాద్,**జనవరి 21ప్రజావినికిడి**



స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో మెగాస్టార్ చిరంజీవి తళుక్కుమన్నారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డితో కలిసి ప్రముఖ సినీనటుడు చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్‌కు వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండటంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి.. సదస్సుకు రావాలని ఆహ్వానించడంతో ఆయన కూడా హాజరయ్యారు. సదస్సు వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ ను చిరంజీవి చూశారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి దృక్పథాన్ని ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది. అనంతరం చిరంజీవితో రేవంత్ మాట్లాడుతూ ..కుటుంబసభ్యులతో కలిసి 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా చూశానని.. ఎంతో ఆస్వాదించానని తెలిపారు. ఈ సందర్భంగా చిరంజీవికి సిఎం అభినందనలు తెలిపారు.



## ఢిల్లీలో మరోమారు క్షీణించిన గాలి నాణ్యత

న్యూఢిల్లీ**జనవరి 21ప్రజావినికిడి** ఢిల్లీలో గాలి నాణ్యత మరింతగా క్షీణించాయి. గతంకంటే గాలి నాణ్యతలు కొంత మెరుగుపడినప్పటికీ.. ఎక్యూఐ స్థాయిలు వెరీపూర్ కేటగిరీలోనే కొనసాగతున్నాయి. బుధవారం ఉదయం 9 గంటలకు ఎక్యూఐ 339గా వద్ద నమోదైంది. దీంతో కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) వీటి స్థాయిల్ని వెరీపూర్ కేటగిరీలో వర్గీకరించింది. మంగళవారం ఎక్యూఐ 395 స్థాయిల వద్ద నమోదైంది. నిన్నటికంటే ఈరోజుకి గాలి నాణ్యతలు మెరుగుపడ్డాయని సిపిసిబి వెల్లడించింది. ఓుగా, ఢిల్లీలో 30 వాతావరణ పర్యవేక్షణా కేంద్రాల్లో గాలి నాణ్యతలు 'వెరీ పూర్' కేటగిరీలోనే నమోదయ్యాయి. ఎనిమిది కేంద్రాల్లో పూర్ కేటగిరీలో ఎక్యూఐ స్థాయిలు నమోదైనట్లు సమీర్ యాప్ సమాచారం తెలిపినట్లు సిపిసిబి పేర్కొంది. ఇక ఢిల్లీలో జహంగిర్‌పూర్‌లో గాలి నాణ్యతలు పేలవంగా నమోదయ్యాయి. అక్కడ ఎక్యూఐ స్థాయిలు 390గా నమోదైనట్లు సిపిసిబి పేర్కొంది.

# టీ20 ప్రపంచ కప్ 15 జట్ల స్క్వాడ్స్ విడుదల



టీ20 ప్రపంచ కప్ కోసం 15 జట్లను ప్రకటించారు. అంతకుముందు, 15 మంది సభ్యులతో కూడిన టీం ఇండియా జట్టును ప్రకటించారు. దీని తర్వాత, ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు మరియు ఆస్ట్రేలియన్ క్రికెట్ బోర్డు టీ20 ప్రపంచ కప్ కోసం తాత్కాలిక జట్లను ప్రకటించాయి. ఇప్పుడు దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ మరియు ఆఫ్ఘనిస్తాన్ కూడా తమ టీ20 ప్రపంచ కప్ జట్లను ప్రకటించాయి. దీని ప్రకారం, రాబోయే టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొనే 15 జట్లు ఈ క్రింది విధంగా ఉన్నాయి.జింబాబ్వే: సికందర్ రజా (కెప్టెన్), బ్రియాన్ బెన్నెట్, ర్యాన్ బర్లే, గ్రేమ్ క్రీమర్, బ్రాడ్లీ ఎవాన్స్, ÷-లకైవ్ మదాండే, టినోటెండా మపోసా, తడివానాషే మారుమణి, వెల్లింగ్టన్ మసకద్జా, టోనీ మునియోంగా, తషింగా ముసెకివా, లబెస్సింగ్ ముజారబానీ, రిచెర్స్ నైగ్రరావానీ, ÷-లబెస్సింగ్ ముజారబానీ, ఇంగ్లాండ్ టీ20 జట్టు (తాత్కాలిక): హ్యారీ బ్రూక్ (కెప్టెన్), రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, టామ్ బాంటన్, జాకబ్ బెథెల్, జోస్ బట్లర్, సామ్ కుర్రాన్, లియామ్ డాసన్, బెన్ డకెట్, విల్ జాక్స్, జామీ ఓవర్టన్, ఆదిల్ రషీద్, ఫిల్ సాల్ట్, జోష్ టోంగ్, ల్యూక్ వుడ్.స్ట్రేలియా టీ20 జట్టు (తాత్కాలిక): మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నోలీ, పాట్ కమ్మిన్స్, టిమ్ డేవిడ్, కామెరాన్ గ్రీన్, నాథన్ ఎల్లిస్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కుహ్నేమాన్, ÷-లగెన్ మాక్స్‌వెల్, మాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.ఒమన్ టీ20 జట్టు: జతీందర్ సింగ్ (కెప్టెన్), వినాయక్ శుక్లా, మహ్మద్ నదీమ్, షకీల్ అహ్మద్, హమ్మద్ మిర్జా, వసీం అలీ, కరణ్ సోనోవాల్, షా ÷సైల్, నదీమ్ ఖాన్, సుఫ్యాన్ మెహమూద్, జై ఒడెదర, షఫీక్ జాన్, ఆశిష్ రమానంది, హసీన్ ఒడెదర, జితీన్.దక్షిణాఫ్రికా టీ20 జట్టు: ఐడెన్ మార్క్రామ్ (కెప్టెన్), క్వింటన్ డి కాక్, టోనీ డి జోర్జి, డెవాల్డ్ బ్రీవిస్, డేవిడ్ మిల్లర్, డొనోవన్ ఫెరీరా, మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబడ, క్వేనా మఫాకా, లుంగి ఎన్‌గిడి, జాసన్ స్మిత్, కార్బిన్, జార్జి లిన్నియా, జార్జి లిన్నియా.నెదర్లాండ్స్ టీ20 జట్టు: స్కాట్ ఎడ్వర్డ్స్ (కెప్టెన్), కోలిన్ అకెర్మాన్, నోహ్ క్రూస్, బాస్ డి లీడే, ఆర్యన్ దత్, ఫ్రెడ్ క్లాసెన్, కైల్ ÷-లకైన్, మైఖేల్ లెవిట్, జాక్ లియోన్-కాచెట్, మాక్స్ ఓ’డౌడ్, లోగాన్ వాన్ బీక్, టిమ్ వాన్ మ్వెలోఫ్, టిమ్ వాన్ మ్వెలోఫ్ మీకెరెన్, సాకిబ్ జుల్ఫికర్.ఆఫ్ఘనిస్థాన్ టీ20 జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, సైదిఖుల్లా అటల్, ఫజల్‌హక్ ఫరూకీ, రహ్మానుల్లా గుర్బాజ్, నవీన్ ఉల్ హక్, మహ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, మహ్మద్ నబీ, అజ్మతుల్లా నబీ, అజ్మతుల్లా నబీ, అజ్మతుల్లా నబీజే దర్విష్ రసూలీ, ఇబ్రహీం జద్రాన్.నమీబియా ÷20 జట్టు: గెర్హార్డ్ ఎరాస్మస్ (కెప్టెన్), జేన్ గ్రీన్, బెర్నార్డ్ స్కోల్ట్జ్, రూబెన్ ట్రంపెల్మాన్, ఏప స్మిత్, జాన్ ఫ్రీలింక్, లారెన్ స్టీన్‌క్యాంప్, మలన్ క్రుగర్, నికోల్ లాఫ్టీ-ఈటన్, జాక్ బ్రాసెల్, బెన్ షికోంగో, ఏఅ బాల్ట్, డిలాన్ లీచర్, చిఖ హీంగెబర్గ్, మాక్స్ హింగో.న్యూజిలాండ్ టీ20 జట్టు: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, ఆడమ్ మిల్నే, జేమ్స్ నీషమ్, ÷-లగెన్ ఫిలిప్స్, రాచిన్ రవీంద్ర, టిమ్ సీఫెర్ట్, ఇష్ సోధి.ఐర్లాండ్ టీ20 జట్టు: పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), మార్క్ అడైర్, రాస్ అడైర్, బెన్ కాలిట్జ్, కర్టిస్ కాంపర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, మాథ్యూ హంఫ్రీస్, జోష్ లిటిల్, బారీ మెక్‌కార్తీ, హ్యారీ టెక్టర్, టిమ్ టెక్టర్, లోర్కాన్ టక్కర్, బెన్ వైట్, క్రెయిగ్ యంగ్‌బంగ్లాదేశ్: లిటన్ దాస్ (కెప్టెన్), తాంజిద్ హసన్, పర్వేజ్ హొళస్సేన్ ఎమాన్, సైఫ్ హసన్, తౌహిద్ హృదయ్, షమీమ్ హొళస్సేన్, క్వాజీ నూరుల్ హసన్ సోహన్, షక్ మహేదీ హసన్, రిషాద్ హొళస్సేన్, నసుమ్ అహ్మద్, ముస్తాఫిజుర్ రహమాన్, తన్‌జీమ్ ఎ హసన్, తన్‌జీమ్ ఎ హసన్.ఇటలీ టీ20 జట్టు: వేన్ మాడ్సెన్ (కెప్టెన్), మార్కస్ కాంపోపియానో, జియాన్ పియరో మీడే, జైన్ అలీ, అలీ హసన్, క్రిషన్ జార్జ్, హ్యారీ మానెంటి, ఆంథోనీ మోస్కా, జస్టిన్ మోస్కా, సయ్యద్ నఖ్వీ, బెంజమిన్ మనేంటి, జస్‌ప్రీత్ సింగ్, గ్రాంట్ స్మత్స్, గ్రాంట్ స్మత్స్.నేపాల్ టీ20 జట్టు: రోహిత్ పౌడెల్ (కెప్టెన్), దీపేంద్ర సింగ్ ఎయిరి, సందీప్ లామిచానే, కుశాల్ ఆసిఫ్ షేక్, సందీప్ జోరా, ఆరిఫ్ షేక్, బసీర్ అహ్మద్, సోంపాల్ కమీ, కరణ్ కెసి, నందన్ యాదవ్, గుల్షన్ ఝా, బి షేర్ రాజభమ్సి, లోకేశ్ రాజభంసీ, లోకేశ్‌కెనడా టీ20 జట్టు: దిల్‌ప్రీత్ బజ్వా (కెప్టెన్), అజయ్‌వీర్ హుండాల్, అన్ష్ పటేల్, ధిల్లాన్ హెలిగర్, హర్ష్ ఠాక్రే, జస్కరన్‌దీప్ భట్టర్, కలీమ్ సనా, కన్వర్‌పాల్ తత్గూర్, నవనీత్ ధలీవాల్, నికోలస్ కిర్టన్, రవీందర్‌పాల్ సింగ్, సాద్ బిన్ యూ జాఫ్రే, శివంబ్రా శర్మ, మోబ్రా షర్యస్ యువరాజ్ సమ్రా.భారత టీ20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), జస్‌ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, వాషింగ్టన్ కీపర్ (వాషింగ్‌టన్ కీపర్), క్వింగ్టన్ కీపర్ రింకూ సింగ్.



# చరిత్ర సృష్టించిన అభిషేక్ శర్మ!

టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ చరిత్ర సృష్టించాడు. అంతర్జాతీయ టీ20ల్లో 25 బంతుల్లోపే అత్యధిక హాఫ్ సెంచరీలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఈ పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 5వేల పరుగులు చేసిన బ్యాటర్‌గా రికార్డ్ సాధించాడు. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా నాగ్‌పూర్ వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించడం ద్వారా అభిషేక్ శర్మ ఈ ఫీట్ సాధించాడు.అంతర్జాతీయ టీ20ల్లో 25 బంతుల్లోపే హాఫ్ సెంచరీ సాధించడం అభిషేక్ శర్మకు ఇది 8వ సారి. ఈ క్రమంలో అతను ఇంగ్లండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, వెస్టిండీస్ ప్లేయర్ ఎవిన్ లూయిస్‌లను అధిగమించాడు. ఈ ముగ్గురు బ్యాటర్లు 25 బంతుల్లోపు 7 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు.న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా భారత బ్యాటర్ నమోదు చేసిన టీ20 హాఫ్ సెంచరీ కూడా ఇదే. ఈ క్రమంలో అతను కేఎల్ రాహుల్, రోహిత్ శర్మల రికార్డ్‌ను అభిషేక్ శర్మ అధిగమించాడు. ఈ ఇద్దరూ 23 బంతుల్లో న్యూజిలాండ్‌పై హాఫ్ సెంచరీ సాధించగా.. అభిషేక్ శర్మ 22 బంతుల్లో హాఫ్ సెంచరీ బాది ఈ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు.ఈ మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన అభిషేక్ శర్మ తృటిలో సెంచరీ చేసే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 35 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్స్‌తో 84 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అతని విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 238 పరుగుల భారీ స్కోర్ చేసింది.

# ప్రపంచకప్ గెలవాలంటే రోహిత్ శర్మనే కెప్టెన్‌గా ఉండాలి

## మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సూచన



సీసీ వన్డే ప్రపంచకప్ 2027లో టీమిండియా విజేతగా నిలవాలంటే రోహిత్ శర్మనే కెప్టెన్‌గా కొనసాగించాలని మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అన్నాడు. అసలు కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించాల్సిన అవసరం ఏం ఉందని ప్రశ్నించాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో 2-1తో టీమిండియా ఓటమిపాలైన సంగతి తెలిసిందే.38 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ వన్డే సిరీస్ గెలిచింది. దాంతో టీమ్‌మేనేజ్‌మెంట్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరాజయం నేపథ్యంలో ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనోజ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తప్పించాల్సిన అవసరం ఏం ఉంది? ఇప్పటికీ రోహిత్ శర్మ కెప్టెన్‌గా కొనసాగి ఉంటే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఫలితం మరోలా ఉండేది. ఎందుకంటే రోహిత్ శర్మ సారథ్యంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచినప్పుడు జట్టు సరైన దిశలో నడుస్తుందని నేను భావించాను.ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు. రోహిత్ శర్మకు తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలి. వన్డే ప్రపంచకప్ సమీపిస్తున్న తరుణంలో బీసీసీఐ తన తప్పును తెలుసుకొని సరిదిద్దుకోవాలి. ఇది ప్రపంచకప్‌కు సంబంధించిన విషయం. ఏదో ఒక ద్వైపాక్షిక సిరీస్ లేదా సాధారణ టోర్నీ గురించి మనం మాట్లాడటం లేదు. దేశం గర్వించే మెగా టోర్నీ కోసం అనుభవం కలిగిన సారథి అవసరం.రోహిత్ శర్మకు అపారమైన అనుభవం ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్‌గా అనుభవం లేదు. రోహిత్ అతని కంటే చాలా ముందున్నాడు. అనుభవం కలిగిన కెప్టెనా? కాదా? అనేది వారి ఫీల్డ్ సెటప్, బౌలింగ్ మార్పులు, ఏ బౌలర్‌తో ఏ ఎండ్ నుంచి బౌలింగ్ చేయిస్తున్నారు? అనే విషయాలతో తెలిసిపోతుంది.హిట్ శర్మ.. శుభ్‌మన్ గిల్ కంటే ఎంతో గొప్ప సారథి. అందుకే హిట్ మ్యాన్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్‌గా నిలిచాడు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో కూడా భారత్ ప్రపంచకప్ గెలవవచ్చు. కానీ రోహిత్‌తో పోల్చినప్పుడు అతను అనుభవం లేని కెప్టెన్‌గా కనిపిస్తున్నాడు. గిల్ కెప్టెన్సీలో కంటే రోహిత్ సారథ్యంలో టీమిండియా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.'అని మనోజ్ తివారి చెప్పుకొచ్చాడు.

# హార్దిక్ పాండ్యాపై ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు



హార్దిక్ పాండ్యాపై మాజీ క్రికెటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు కురిపించాడు. హార్దిక్ పాండ్యాలా బంతితో పాటు బ్యాట్‌తో రాణించే ఆటగాడు ఈ ప్రపంచంలోనే లేడని కొనియాడాడు. అతను లేకుంటే టీమిండియా కాంబినేషన్ అసంపూర్ణమని అభిప్రాయపడ్డాడు.హార్దిక్ పాండ్యాతోనే టీమిండియాకు సరైన కాంబినేషన్ లభిస్తుందని తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 ముందు టీమిండియా తమ చివరి ద్వైపాక్షిక టీ20 సిరీస్‌కు సిద్దమైంది. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో బరిలోకి దిగనుంది. టీమ్ కాంబినేషన్‌ను ÷నైల్ చేసేందుకు మేనేజ్‌మెంట్ ఈ సిరీస్‌ను వాడుకోనుంది.ఈ సిరీస్ నేపథ్యంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన ఆకాశ్ చోప్రా.. టీమిండియాకు హార్దిక్ పాండ్యా ఎంత కీలకమో వివరించాడు. 'హార్దిక్ పాండ్యా లేకుంటే టీమిండియా కాంబినేషన్ అసంపూర్ణంగా ఉంటుంది. ఈ ప్రపంచంలోనే హార్దిక్ లాంటి ఆటగాడు మరొకరు లేరు.

# టీమ్ ఇండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలక మార్పులు





న్యూజిలాండ్‌తో బుధవారం నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు సంబంధించి టీమ్ ఇండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గాయం కారణంగా దూరమైన తిలక్ వర్మ స్థానంలో నెంబర్ 3లో ఎవరు ఆడతారనే ఉత్కంఠకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తెరదించారు. శ్రేయస్ అయ్యర్ జట్టులో ఉన్నప్పటికీ, ఇషాన్ కిషన్‌కే ఆ బాధ్యతలు అప్పగించాలని మేనేజ్మెంట్ నిర్ణయించింది.భారత్ వర్సెస్ న్యూజిలాండ్ మధ్య నాగ్‌పూర్ వేదికగా జరగనున్న మొదటి టీ20 మ్యాచ్‌కు ముందు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మీడియాతో మాట్లాడాడు. గాయపడిన తిలక్ వర్మ స్థానంలో ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడని ఆయన స్పష్టం చేశాడు. నిజానికి తిలక్ స్థానంలో శ్రేయస్ అయ్యర్ జట్టులోకి వచ్చినప్పటికీ, ఇషాన్‌ను ఎంచుకోవడానికి గల కారణాన్ని సూర్య వివరించాడు.'ఇషాన్ కిషన్ మా టీ20 ప్రపంచకప్ 2026 జట్టులో సభ్యుడు. ప్రపంచకప్ జట్టులో ఉన్న ఆటగాళ్లకు తగినన్ని అవకాశాలు ఇవ్వడం మా బాధ్యత. అందుకే అతను మూడో స్థానంలో బరిలోకి దిగుతాడు' అని సూర్య పేర్కొన్నారు. ఇషాన్ గత ఏడాదిన్నర కాలంగా భారత్ తరపున ఆడకపోయినప్పటికీ, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడని సూర్య కితాబు ఇచ్చాడు.శ్రేయస్ అయ్యర్ ఒక స్పెషలిస్ట్ బ్యాటర్ అయినప్పటికీ, అతను కేవలం తిలక్ వర్మకు తాత్కాలిక రీప్లేస్‌మెంట్‌గా మాత్రమే మొదటి మూడు మ్యాచ్‌లకు ఎంపికయ్యాడు. కానీ ఇషాన్ కిషన్ ఇప్పటికే ప్రపంచకప్ ప్రధాన జట్టులో ఉండటంతో, టీమ్ కాంబినేషన్ దృష్ట్యా అతనికే ఓటు వేశాడు. ఒకవేళ 4 లేదా 5వ స్థానాల గురించి చర్చ జరిగితే సమీకరణాలు వేరుగా ఉండేవని, కానీ ప్రస్తుతం నెంబర్ 3కి ఇషానే సరైన ఎంపిక అని కెప్టెన్ స్పష్టం చేశాడు.తన స్వంత బ్యాటింగ్ స్థానం గురించి మాట్లాడుతూ.. సూర్యకుమార్ తాను ఏ స్థానంలోనైనా ఆడటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 'నాకు నెంబర్ 4లో మెరుగైన రికార్డు ఉంది. కానీ, జట్టు అవసరాలను బట్టి నెంబర్ 3లో కూడా ఆడగలను. ఒకవేళ సంజూ శాంసన్ అవుట్ అయితే, పరిస్థితిని బట్టి రైట్ హ్యాండ్ బ్యాటర్ అవసరమైతే నేనే ముందుకు వెళ్తాను' అని అన్నాడు.గత కొద్దికాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న సూర్య, తన సహజ సిద్ధమైన ఆట తీరును మార్చుకోనని తేల్చి చెప్పాడు. 'నాకు పరుగులు రాకపోవచ్చు, కానీ నా శైలిని మార్చుకోలేను. గత 3-4 ఏళ్లుగా నాకు సక్సెస్ ఇచ్చిన పద్ధతిలోనే బ్యాటింగ్ చేస్తాను. నెట్స్‌లో నేను ఎప్పుడూ ఆడేలాగే ఆడుతున్నాను' అని ధీమా వ్యక్తం చేశాడు.వ్యక్తిగత రికార్డుల కంటే జట్టు గెలుపే తనకు ముఖ్యమని సూర్య గుర్తు చేశాడు. 'నేను టెన్నిస్ లేదా టీటీ లాంటి వ్యక్తిగత క్రీడలు ఆడితే నా ఫామ్ గురించి ఆందోళన చెందేవాడిని. కానీ ఇది టీమ్ గేమ్. 14 మంది ఆటగాళ్లను చూసుకోవాల్సిన బాధ్యత కెప్టెన్‌గా నాపై ఉంది. జట్టు గెలిస్తే నేను సంతోషిస్తాను' అని ముగించాడు.

# సోషల్ మీడియా విమర్శలకు దూరం

## దురంధర్ మూవీపై సారా అర్జున్



ఇటీవల సంచలనం సృష్టించిన చిత్రం 'ధురంధర్' విజయం ఎంతటి హాట్ టాపిక్‌గా మారిందో.. ఇందులో ప్రధాన పాత్రలో నటించిన నటీనటుల మధ్య వయసు వ్యత్యాసం కూడా అంతే వైరల్ అయ్యింది. రణ్‌వీర్ సింగ్ , సారా అర్జున్ మధ్య 20 ఏళ్ల వయసు తేడా ఉండడంతో ఈ సినిమా టీజర్ వచ్చినప్పటినుంచే విమర్శలు మొదలయ్యాయి. తాజాగా దీనిపై సారా అర్జున్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. తాను ఇలాంటి విషయాలు పట్టించుకోను అని అన్నారు. ఇవన్నీ సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలే కదా.. నేను సామాజిక మాధ్యమాల్లో పెద్దగా యాక్టివ్‌గా ఉండను. అందుకే అవి నా వరకు రాలేదు. అయినా.. ఒక విషయంపై ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయి. 'మనం ప్రశాంతంగా ఉందాం.. పక్కవారిని ప్రశాంతంగా ఉండనిద్దాం' అనే సిద్ధాంతాన్ని నేను నమ్ముతాను. పాటిస్తాను. నాకు 'ధురంధర్' కథ నచ్చింది. ఆ కథకు నేను న్యాయం చేస్తానని అనిపించింది. అందుకే ఓకే చేశా. బహుశా దీనిగురించి టీజర్ వచ్చినప్పుడే మాట్లాడుకున్నారు. నేను ఆ సమయంలో అసలు ఫోన్ చూడలేదు' అని చెప్పారు. 'నేను చదువుకున్న బోర్డింగ్ స్కూల్‌లో మాకు ఫోన్ లేదు. బయటకు వచ్చిన దగ్గర నుంచి వరుస సినిమాలతో బిజీగా ఉన్నా. అందుకే సోషల్ మీడియా అలవాటు కాలేదు. ఏదైనా పోస్ట్ చేయాలనుకున్నప్పుడు చేస్తానంతే. వినోదం కోసం ఇతర మార్గాలు ఎంచుకుంటా. విరామ సమయంలో ట్రిప్‌లకు వెళ్తుంటా. నేను ఒకేచోట ఎక్కువ రోజులు ఉండలేను' అని సారా అర్జున్ చెప్పారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ధురంధర్' గతేడాది డిసెంబర్ 5న విడుదలై సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికీ థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఇప్పటి వరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,283 కోట్లు వసూలు చేసింది.

----



# నవీన్ చంద్ర హనీ మూవీ

నవీన్ చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'హనీ'. ఈ సినిమాకు కరుణకుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. క్షుం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 6న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. టీజర్ చూస్తుంటే.. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల ఆధారంగా, సమాజంలోని మూఢనమ్మకాలు మరియు అంధ విశ్వాసాల నేపథ్యంలో రూపొందింది. సాధారణ హారర్ సినిమాలకు భిన్నంగా, కేవలం భయపెట్టడమే కాకుండా ఒక మార్మిక ప్రపంచాన్ని ఈ టీజర్‌లో ఆవిష్కరించారు. చీకటి, నిశ్శబ్దం, మర్మమైన శక్తుల కలయికతో దర్శకుడు కరుణ కుమార్ వెన్నులో వణుకు పుట్టించే విజువల్స్‌ను వెండితెరపైకి తీసుకొస్తున్నారు. ప్రధాన పాత్రలో నవీన్ చంద్ర నటన, దివ్య పి÷–లశై, దివి, రాజా రవీంద్రల గూఢమైన పాత్రలు సినిమాపై మరింత ఆసక్తిని కలిగిస్తున్నాయి. అజయ్ అరసాడ అందించిన నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలమని చెప్పవచ్చు. నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటింగ్ ఈ చిత్రానికి సాంకేతిక హంగులను జోడించాయి. సైకలాజికల్ డెప్త్ మరియు సోషల్ రిలవెన్స్ ఉన్న ఈ 'హనీ' చిత్రం ఫిబ్రవరి 6న థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.



# పవన్ సార్.. ప్రధాని స్థాయికి

## నటి నిధి అగర్వాల్

తన సినిమాల విడుదల సమయాల్లోనే కాకుండా తరచూ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటూ ఉంటారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఆమె ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని పవన్ కల్యాణ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పవన్ కల్యాణ్ ఎంతోమందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతం. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. ఆయనతో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. 'హరిహర వీరమల్లు'కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు' అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు. సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా ఆశ్చర్యపడను' అని నిధి అన్నారు.ఒకరిని ఉన్నతస్థానాలకు తీసుకెళ్లడానికి కాకుండా.. తొక్కేయడానికి భారీగా డబ్బులు ఖర్చు చేస్తున్నారు. నటీనటులకు కూడా ఎమోషన్స్ ఉంటాయి. నెగెటివ్ ప్రచారం వల్ల మానసికంగా కుంగిపోతారు. వాళ్లతో పాటు వాళ్ల కుటుంబాలు కూడా ఎంతో బాధను అనుభవిస్తాయని నిధి ఆవేదన వ్యక్తం చేశారు.

---------



# జూనియర్ ఎన్టీఆర్ కు స్వల్ప అనారోగ్యం.. షూటింగ్ కు బ్రేక్!





యంగ్ టైగర్ ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం 'డ్రాగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కొన్ని నెలల గ్యాప్ తర్వాత ఇటీవల షూటింగ్ ను తిరిగి ప్రారంభించిన చిత్రబృందం, హైదరాబాద్‌లో నైట్ షెడ్యూల్‌లో జెట్ స్పీడ్‌తో షూటింగ్ నిర్వహిస్తోంది. రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, మలయాళ స్టార్ టోవినో థామస్, సీనియర్ నటుడు బిజూ మీనన్ కీలక పాత్రలను పోషిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ భారీ ప్రాజెక్ట్ ను నిర్మిస్తోంది.అయితే తాజాగా షూటింగ్ కు స్వల్ప బ్రేక్ పడింది. గత కొన్ని రోజులుగా ఎన్టీఆర్ స్వల్ప జలుబుతో బాధపడుతున్నట్లు సమాచారం. ఆరోగ్య సమస్య పెద్దది కాకపోయినా, పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతో యూనిట్ షూటింగ్ ను తాత్కాలికంగా నిలిపివేసింది. ఇప్పటికే కొన్ని కారణాల వల్ల ఆలస్యమైన ఈ సినిమా షూట్ కు మరోసారి బ్రేక్ పడినా, ఇది కేవలం ఒకటి లేదా రెండు రోజులకు మాత్రమేనని యూనిట్ స్పష్టం చేసింది. త్వరలోనే షూటింగ్ మళ్లీ ప్రారంభమవుతుందని సమాచారం.ప్రశాంత్ నీల్ ఈ సినిమాను హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిస్తున్నారు. మొదట 2026 జనవరి 26న విడుదల చేస్తామని ప్రకటించినా, షూటింగ్ ఆలస్యం కారణంగా రిలీజ్‌ను 2027కి వాయిదా వేశారు.

# చిరంజీవి సినిమాలో కృతి శెట్టి

సినిమాల్లో ఒక హిట్ కొట్టడం కంటే ఆ హిట్‌ను కొనసాగిస్తూ అవకాశాలు దక్కించుకోవడమే అసలైన సవాల్. ఈ విషయాన్ని చాలా మంది హీరోహీరోయిన్ల కెరీర్ స్పష్టంగా చెబుతుంది. ఇప్పుడు అదే పరిస్థితిని ఎదుర్కొంటున్న హీరోయిన్ కృతిశెట్టి గురించి టాలీవుడ్‌లో మళ్లీ చర్చ మొదలైంది.
'ఉప్పెన' సినిమాతో ఒక్కసారిగా స్టార్‌డమ్ తెచ్చుకున్న కృతి... ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసినా ఆశించిన స్థాయి విజయాలు మాత్రం దక్కలేదు. మంచి నటిగా గుర్తింపు ఉన్నప్పటికీ, కమర్షియల్‌గా పెద్ద హిట్ లేకపోవడంతో ఆమె కెరీర్ కొంత స్లో అయిందనే చెప్పాలి. అయితే ఇప్పుడు ఆమెకు మరోసారి భారీ అవకాశం దక్కినట్టు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవలే 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న మెగాస్టార్ చిరంజీవి... తన తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నారు. దర్శకుడు బాబీతో చిరు మరోసారి కలిసి పనిచేయనున్నారు. ఈ సినిమా ఈ నెలలో లాంచ్ అయ్యే అవకాశముండగా, మార్చి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుందని సమాచారం.





Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613